
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 24 సెప్టెంబరు 2025


వెల్‌నెస్ సెంటర్ స్థాపనపై పరిశీలిస్తున్న పతంజలి అధినేత బాబా రాందేవ్ (ఫైల్)

అటకెక్కినట్లేనా...?

- హార్సిలీహిల్స్ అభివృద్ధిని పట్టించుకునేదెవరో...?
- ఉన్నతాధికారుల బదిలీతో పనులపై అనుమానాలు
- అతీగతీలేని ఒబెరాయ్ హోటల్.. పతంజలి వెల్‌నెస్ సెంటర్
- అడుగుముందుకు పడని క్రీడా శిక్షణా కేంద్రం పనులు


అడుగు ముందుకు పడని క్రీడా శిక్షణా కేంద్రం


హిల్స్‌పై చేపట్టిన పనులను సీఎం చంద్రబాబుకు చూపుతున్న కలెక్టర్ శ్రీధర్ (ఫైల్)

బి.కొత్తకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ఊటీగా గుర్తింపు ఉన్న ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ అభివృద్ధి అటకెక్కినట్లే కనిపిస్తోంది. టూరిజం రంగాన్ని ఉరకలెత్తించి తద్వారా ఆదాయ మార్గాలను పెంచుకోవాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారులు తమ వంతు ప్రయత్నాలను తీవ్రంగా చేశారు. అయితే వారి బదిలీలతో ఇక బ్రేక్ పడినట్టే అనిపిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటకశాఖ హార్సిలీహిల్స్ అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి పెట్టకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైంది పరిస్థితి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత హార్సిలీహిల్స్ అభివృద్ధి కోసం ప్రయత్నాలు మొదలయ్యాయి. అయితే ఆ ప్రయత్నాలు ఫలించకపోవడం, తగిన నిధులు మంజూరు కాకపోవడం, ఆ అధికారులు బదిలీపై వెళ్లడంతో కథ మళ్లీ మొదటికొచ్చినట్లైంది. క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి జిల్లాకు చెందిన వ్యక్తి అయినా హార్సిలీహిల్స్‌లోని క్రీడా శిక్షణా కేంద్రం పనులు అడుగుముందుకు పడకపోవడం కూడా విస్మయం కలిగిస్తోంది.

అతీగతీలేని ఒబెరాయ్..పతంజలి

హిల్స్‌పై రూ.200 కోట్లతో ఒబెరాయ్ హోటల్ నిర్మిస్తామని చెప్పిన సంస్థకు ప్రభుత్వం 19.80 ఎకరాల భూమి కేటాయించి ఏళ్లు గడుస్తున్నా అది పెండింగ్‌లో ఉండటంతో రెండు సార్లు ఆ సంస్థ ప్రతినిధులను రప్పించి హిల్స్‌లో హోటల్ స్థాపనకు అనుకూలతలను జిల్లా అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించి వారిని ఒప్పించే ప్రయత్నం చేశారు. అయినా వారి నుంచి సానుకూల సమాచారం లేదు. పతంజలి సంస్థ ద్వారా వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు స్థలం, ఓ భవనం కేటాయించారు. ఆ సంస్థ అధినేత బాబా రాందేవ్ స్వయంగా వచ్చి హిల్స్ వాతావరణం, అనుకూలతలను పరిశీలించారు. ఈ రెండు నిర్మాణాలు జరిగితే హార్సిలీహిల్స్ జాతీయస్థాయి గుర్తింపుతో పాటు, ఉన్నతస్థాయి పర్యాటకుల సందర్శన, ఆదాయం పెరుగుతుందని భావించారు. అయితే వాటిపై అతీగతీ లేదు. ఈ విషయమై పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

ఉన్నతాధికారుల బదిలీతో బ్రేక్

ప్రముఖ సంస్థ ఒబెరాయ్‌తో హోటల్ నిర్మాణం కోసం ఆ సంస్థ ప్రతినిధులను ఒప్పించే క్రమం, పతంజలి సంస్థ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు ప్రయత్నాలు, పీకేఎం ఉడా-టౌన్‌షిప్ కమిటీ నిధులతో పర్యాటకులను ఆకట్టుకునే సుందరీకరణ పనుల నిర్మాణం, ఘాట్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమం చేయడంలో ఇటీవలి వరకు ఇక్కడ పనిచేసిన కలెక్టర్ చామకూరి శ్రీధర్, మదనపల్లి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ల కృషి ఎనలేనిది. పలుమార్లు హిల్స్‌లో పర్యటించి అభివృద్ధికి ప్రయత్నం చేశారు. పలమనేరు-మదనపల్లి-కుప్పం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, టౌన్‌షిప్ కమిటీ నిధులతో ప్రధాన కూడళ్లలో సుందర నిర్మాణాలు, కొండను చుట్టేస్తూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కొన్ని పనులు పూర్తవగా వాకింగ్‌ట్రాక్‌తో పాటు మరికొన్ని జరగాల్సి ఉంది. ఘాట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి.

అడుగు ముందుకు పడని క్రీడా శిక్షణా కేంద్రం..

జాతీయ స్థాయి గుర్తింపు తేవడంలో భాగంగా క్రీడాకారులను తయారు చేయాలన్న లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శాప్‌కు 3.74 ఎకరాల స్థలాన్ని కేటాయించి, రూ.3.20 కోట్ల నిధులనూ విడుదల చేశారు. వాటిలో రూ.2.20 కోట్లు ఖర్చు చేసి ప్రహరీని నిర్మించారు. మిగిలిన నిధులు మురిగిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ క్రీడా శిక్షణా కేంద్రం పనులు చేయడం అటుంచి, ఇందులో 2 ఎకరాలను సినీ దర్శక నిర్మాత మహీ రాఘవకు కట్టబెట్టేందుకు విఫలయత్నం చేశారు. సాధ్యం కాకపోవడంతో రూ.కోట్ల విలువైన స్థలం మిగిలింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. జిల్లాకే చెందిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి క్రీడల శాఖా మంత్రిగా ఉన్నారు. నిధులు మంజూరు చేయించి క్రీడా శిక్షణను ప్రారంభిస్తే, ప్రతిభావంతులైన క్రీడాకారులు తయారు కావడంతో పాటు హార్సిలీహిల్స్‌కు మరింత గుర్తింపు వస్తుంది.

సుందరీకరణ పనులైనా సాగేనా?

ఆశించిన విధంగా ప్రధాన ప్రాజెక్టుల స్థాపనకు బీజం పడకపోవడంతో అందుబాటులో ఉన్న నిధులతో పర్యాటకుల ఆకర్షణకు ఇటీవలి వరకు పనిచేసిన కలెక్టర్, ఆయన ఆదేశాల మేరకు టౌన్‌షిప్ కమిటీ చైర్మన్ హోదాలో మేఘస్వరూప్ పలు సుందరీకరణ పనులను చేపట్టారు. హిల్స్ ముఖద్వారం, హరితసర్కిల్, జిడ్డు క్రిష్ణమూర్తి సర్కిల్, వివేకానంద స్టాచ్యు, గాలిబండలపై సుందర నిర్మాణాలు చేపట్టారు. అన్ని సర్కిళ్లను కలుపుతూ వాకింగ్‌ట్రాక్‌కు అంచనాలు వేశారు. అయితే పనులు మొదలు కాలేదు. ఇకపై కొనసాగుతాయా అనే అనుమానం కూడా మొదలైంది. ఘాట్‌రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరైనా పనులు మొదలుకాలేదు. పర్యాటకుల రక్షణ కోసం కొండపై ఏర్పాటు చేసిన ఔట్‌పోస్ట్, దిగువ భాగంలో వాహనాల తనిఖీల కోసం ఏర్పాటైన పోలీస్ చెక్‌పోస్ట్ సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుత జిల్లా అధికారులు హిల్స్‌ను సందర్శించి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని, నిధులు మంజూరు చేయించి హార్సిలీహిల్స్ రూపురేఖలు మార్చాలని పర్యాటకులు కోరుతున్నారు.



బాధితులకు సత్వర న్యాయం అందించాలి

- ఎస్పీ ధీరజ్‌తో కర్నూల్ రేంజ్ డీఐజీ


కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌తో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం అందించడం ద్వారా పోలీసులు ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందుతారని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఎస్పీ ధీరజ్ కునుబిల్లికి తెలిపారు. కర్నూలు డీఐజీ కార్యాలయంలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి డీఐజీని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యకలాపాలు, ప్రజాభద్రతా చర్యలు, నేర నియంత్రణ పట్ల అనుసరిస్తున్న వ్యూహాలపై చర్చించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేస్తూ ప్రజలకు భద్రతతో పాటు భరోసా కల్పించాలని ఎస్పీకి తెలిపారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని సూచించారు. డీఐజీ సూచనలను అమలు చేస్తూ జిల్లాలో ప్రజలకు మరింత చేరువగా పోలీసింగ్ అందించడానికి కృషి చేస్తామని ఎస్పీ డీఐజీకి హామీ ఇచ్చారు.

మదనపల్లెను జిల్లా కేంద్రం చేయాలి

- అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్రాసు రాష్ట్రంలో ఉన్నపుడు 1860 సంవత్సరంలోనే మదనపల్లె రెండవ పరిపాలనా కేంద్రంగా ఉండేదని, అటువంటి మదనపల్లెను జిల్లా కేంద్రంగా మార్చాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అసెంబ్లీలో గళం విప్పారు. మంగళవారం రాష్ట్ర అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద టమోటా మార్కెట్ అయిన మదనపల్లె మార్కెట్ కేవలం 17 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, ఇక్కడ ట్రాఫిక్ సమస్య వస్తోందని, మార్కెట్ యార్డు మార్చడానికి 50 ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, రోడ్లు వెడల్పు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తులకు రక్షణ, ముస్లింల హక్కులకు రక్షణ కల్పించాలంటే సీఎం చంద్రబాబుకే సాధ్యమన్నారు.

మేయర్ సురేశ్‌బాబుపై వేటు

- పదవినుంచి తొలగించిన ప్రభుత్వం



(కడప-ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, నగర మేయర్ సురేశ్‌బాబు మధ్య జరిగిన కుర్చీ పోరు ఎట్టకేలకు ముగిసింది. సురేశ్‌బాబును మేయర్ పదవి నుంచి తొలగిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీ యాక్ట్ ప్రకారం కార్పొరేషన్ మేయర్, మున్సిపాలిటీ చైర్మన్‌లు వారి కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూరేవిధంగా ఎలాంటి కాంట్రాక్టు పనులు చేపట్టకూడదు. అయితే కడప మేయర్ సురేశ్‌బాబు తన సతీమణి కొమ్మద్ది జయశ్రీ, కుమారుడు అమర్ పేర్లతో ఉన్న వర్ధిని కన్‌స్ట్రక్షన్ పేరిట కడపలో పలు కాంట్రాక్టు పనులు చేపట్టారు. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండడం, కార్పొరేషన్ పాలకవర్గం వైసీపీ చేతిలో ఉండటంతో వారు ఆడింది ఆటగా పాడింది పాటగా సాగింది. సురేశ్‌బాబు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలడంతో ఆయనను మేయరు పదవి నుంచి తొలగిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జీవో ఆర్టీ నెంబర్ 1016ను మంగళవారం జారీచేసింది. ఈ విషయంపై సురేశ్‌బాబును వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా ఆయన ఫోను లిఫ్ట్ చేయలేదు.

జగనన్న ఖాళీలు

- బీళ్లుగా జగనన్న కాలనీలు
- జిల్లాలో 602 ఎకరాలు ఖాళీ
- ఎంఎస్ఎంఈలకు కేటాయించేందుకు సన్నాహాలు
- లబ్ధిదారులకు మరోచోట ఇళ్ల స్థలాలు

6


గండికోటలో పూర్తి స్థాయి నీటిమట్టం

కొండాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కరువుబారిన పడిన రాయలసీమ జిల్లాల్లో అతిపెద్దదైన గండికోట ప్రాజెక్టు మంగళవారం ఉదయం పూర్తిస్థాయి నీటిమట్టం 26.85 టీఎంసీలకు చేరుకుని మరోసారి రికార్డు సృష్టించింది. 2021 నుంచి వరుసగా ఆరేళ్లుగా ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టంతో ఈ ఏడాది కూడా అరుదైన ఘనత సాధించింది. గాలేరు-నగరిలో అంతర్భాగమైన ఈ ప్రాజెక్టు రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఈ ప్రాజెక్టు నుంచి మైలవరం, చిత్రావతి, పైడిపాళెం, వామికొండ, సర్వరాయసాగర్ ప్రాజెక్టులతో పాటు పలు ఎత్తిపోతల పథకాలకు నీరందిస్తూ కరువుతో అల్లాడుతున్న జిల్లా రైతాంగానికి దన్నుగా నిలుస్తోంది. పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకోవడంతో మైలవరం జలాశయానికి 1000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి అవుకు రిజర్వాయర్ నుంచి వరదకాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1,450 క్యూసెక్కులు వస్తోందన్నారు. సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామని ఈఈ తెలిపారు.

వైభవంగా ధ్వజస్తంభ సంప్రోక్షణకు అంకురార్పణ 6

ములకలచెరువుకు పోటెత్తుతున్న టమోటాలు

- ఒకేరోజు 706 మెట్రిక్ టన్నులు ఎగుమతి
- 1.20 లక్షల బాక్సుల కాయలు రాక


ములకలచెరువు మార్కెట్‌కు పోటెత్తిన టమోటాలు

ములకలచెరువు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మార్కెట్‌కు టమోటాలు గతంలో ఎన్నడూ లేనంతగా భారీ స్థాయిలో అమ్మకానికి వస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు తోటల్లోని టమోటాలు కోయడానికి వీలు కాలేదు. వర్షాలు కాస్త తగ్గడంతో రైతులు కోతలు కోస్తున్నారు. సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మార్కెట్‌కు టమోటాలు రికార్డు స్థాయిలో అమ్మకానికి వచ్చాయి. వేలాది వాహనాలు టమోటాలు తీసుకుని రావడంతో మార్కెట్ కిక్కిరిసిపోయింది. సోమవారం రాత్రి ఒక్కరోజే 706 మెట్రిక్ టన్నుల టమోటాలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యాయి. మంగళవారం కూడా భారీ స్థాయిలో వచ్చాయి. మంగళవారం మార్కెట్‌లో 22 కేజీల బాక్సు నాణ్యతను బట్టి రూ.300 నుంచి రూ.600 వరకు పలికాయి. ప్రతిరోజు లక్ష నుంచి 1.20 లక్షల క్రేట్ల కాయలు అమ్మకానికి వస్తున్నాయంటే ఎంత భారీ స్థాయిలో వస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాలతో పాటు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి రైతులు టమోటాలను ఇక్కడి తీసుకొస్తున్నారు. ఇక్కడి నుంచి ఢిల్లీ, పశ్చిమబెంగాల్, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిస్సా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. టమోటా వేలం పాటలతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్ కుమార్‌రెడ్డి దగ్గరుండి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.


పాలకొండ్రాయుడుకు అసెంబ్లీ ఘన నివాళి


అసెంబ్లీలో పాలకొండ్రాయుడు మృతికి సంతాపం తెలియజేస్తున్న ఎమ్మెల్యేలు

రాయచోటి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడుకు రాష్ట్ర అసెంబ్లీ మంగళవారం ఘన నివాళి అర్పించింది. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు తెలుగుదేశం పార్టీ మాజీ శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, క్రియాశీల నాయకులు మృతి చెందిన విషయం తెలిసిందే. వీళ్లందరికీ మంగళవారం అసెంబ్లీ సంతాపం తెలిపింది. రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సంతాపం తెలియజేస్తూ.. 1978లో పాలకొండ్రాయుడు జనతా పార్టీ తరపున శాసనసభకు ఎన్నికైన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. 1983లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ గాలి బలంగా వీచినా స్వతంత్ర అభ్యర్థిగా పాలకొండ్రాయుడు గెలుపొందారని, 1989లో పార్లమెంటు సభ్యుడిగా ఎన్నియ్యారని, 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర అభివృద్ధికి, శాసనసభ ఔన్నత్యం కాపాడేందుకు కృషి చేశారని కొనియాడారు. తమతో పాటు ఎన్నికై శాసనసభలో ప్రజాసమస్యల పట్ల అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. ఈ ఏడాది మే 6న ఆయన చనిపోయారని, అటువంటి నాయకుడు మృతి చెందడం పేద ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. దీర్ఘకాలం ప్రజా సేవలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులకు అసెంబ్లీ తమ సంతాపం తెలుపుతోందన్నారు. అనంతరం అసెంబ్లీలో ఎమ్మెల్యేలు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పాలకొండ్రాయుడు కుమారుడు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు మాట్లాడుతూ తమ తండ్రి సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో పేదలకు చేసిన సేవలను గుర్తిస్తూ ఆయన మృతికి సంతాపం తెలిపిన రాష్ట్ర అసెంబ్లీ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గాయత్రి..నమోస్తుతే...

- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- వివిధ రూపాల్లో భక్తులకు అమ్మవారి దర్శనం



రాయచోటిటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఆలయాల్లో రెండోరోజు మంగళవారం శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మదనపల్లెలోని కోర్టులో గంగమ్మ ఆలయంలో అమ్మవారు కుంకుమ అలంకరణలో, కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో గాయత్రిదేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. ములకలచెరువులోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో, పీలేరులోని గ్రామ దేవత రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో గాయత్రీదేవి అలంకారంలో, కన్యకాపరమేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో, గుర్రంకొండలోని చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మ అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులను కటాక్షించారు.


రాజరాజేశ్వరి అలంకరణలో పీలేరు కన్యకా పరమేశ్వరి అమ్మవారు


మదనపల్లె కోర్టులో గంగమ్మ ఆలయంలో కుంకుమ అలంకరణలో గంగమ్మ


ములకలచెరువులో గాయత్రిదేవి అలంకరణలో అమ్మవారు


మదనపల్లె కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో గాయత్రిదేవి అలంకారం

గాయత్రీదేవి అలంకారంలో పీలేరు రౌద్రాల అంకాలమ్మ


రాజంపేటలో బిల్వవృక్ష నివాసిని అలంకారం, అమ్మవారి ముందు వేషధారణలో చిన్నారులు


రాయచోటి వీర భద్రాలయంలో పార్వతీదేవి అలంకారంలో భద్రాకాళి అమ్మవారు

జగనన్న ఖాళీలు

వైసీపీ హయాంలో జగనన్న నవరత్నాలలో భాగంగా ఇబ్బడిముబ్బడిగా ఇళ్ల స్థలాలు కేటాయించారు. గ్రామాలు, పట్టణాలకు సుదూర ప్రాంతాల్లో రాళ్లు, గుట్టలు, కుంట స్థలాల్లో జగనన్న లేఅవుట్లు వేసి దరఖాస్తు చేసిన వారందరికీ ఒకటిన్నర సెంటు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించారు. నివాసయోగ్యం కాని ఈ స్థలాల్లో పట్టా పొందినా.. ఇంటి నిర్మాణాలు చేయలేక కొందరు, అనాసక్తితో ఇంకొందరు ఐదేళ్లు అయినా వాటిని పట్టించుకోలేదు. దీంతో జిల్లాలో వందలాది ఎకరాలు బీడు భూములను తలపిస్తున్నాయి.



- బీళ్లుగా జగనన్న కాలనీలు
- జిల్లాలో 602 ఎకరాలు ఖాళీ
- ఎంఎస్ఎంఈలకు కేటాయించేందుకు ప్రభుత్వం సన్నాహాలు
- లబ్ధిదారులకు మరోచోట ఇళ్ల స్థలాలు



మదనపల్లె మండలం పోతబోలు హౌసింగ్ కాలనీలో ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అడిగిన వారందరికి నవరత్నాల పథకం కింద దరఖాస్తు చేసిన 90 రోజుల్లోనే ఇంటి పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి పెంచారు. దీంతో రెవెన్యూ అధికారులు గ్రామాలు, పట్టణాలకు దూరంగా ఉన్న ప్రభుత్వ స్థలాలు, ప్రైవేటు స్థలాలను సేకరించి జగనన్న ఇళ్ల లేఅవుట్‌లు వేసి, అందులో లబ్ధిదారులకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. చాలా వరకు గుట్టలు, రాళ్లురప్పలు, కుంటలు ఉండే ప్రాంతాల్లోనే లేఅవుట్‌లు వేసి ఇచ్చారు. నివాసయోగ్యం కాని ఈ స్థలాలు తమకు వద్దంటూ అప్పట్లోనే లబ్ధిదారులు రోడ్డెక్కి నిరసనలు కూడా తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో 500 గ్రామ పంచాయతీల్లో మొత్తం 487 లేఅవుట్లు వేశారు. ఇందులో 57,618 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారు. వాస్తవంగా లబ్ధిదారులు అష్టకష్టాలు పడి వారికి కేటాయించిన ఒకటిన్నర సెంటు స్థలాల్లో అప్పులు చేసి పునాదులు, లింటెల్‌లెవెల్, మోల్డింగ్ దశల వరకు కొందరు ఇళ్లను నిర్మించుకున్నారు. కొందరు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి ఇళ్లలోకి చేరారు. ఇలా పునాదుల నుంచి ఇంటి నిర్మాణాలు పూర్తిచేసుకున్న వారి సంఖ్య 33,448 మాత్రమే. మిగిలిన 24,170 మందికి కేటాయించిన ఇళ్ల స్థలాలు ఖాళీగానే ఉన్నాయి. అంటే ఒక్కో లబ్ధిదారుడికి ఒకటిన్నర సెంటు ఇంటి స్థలం చొప్పున 24,170 మందికి కేటాయించిన 36,255 సెంట్లు అంటే 362.55 ఎకరాలు హౌసింగ్ కాలనీల్లో ఖాళీగా వెక్కిరిస్తూ కనిపిస్తూ ఉన్నాయి.

ఎంఎస్ఎంఈలకు స్థలాలు

విజయవాడలో ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు సరికొత్త నిర్ణయాలు తీసుకున్నారు. వైసీపీ పాలనలో తీసుకుని సరిగా అమలుకాని నిర్ణయాలను మార్చి భవిష్యత్ ఉపయోగాలకు, ఆర్థికంగా ఎదిగేందుకు విధి, విధానాలను రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా జగనన్న లేఅవుట్లలో నివాసయోగ్యం కాని ఇళ్ల స్థలాలు, పునాదులు కూడా నిర్మించకుండా మిగిలిపోయిన ఇళ్ల స్థలాలను గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందులో భాగంగా ఇంటి పట్టా పొందిన లబ్ధిదారుడి అనుమతితో ఆ స్థలాలను వెనక్కి తీసుకుని, ఖాళీ స్థలాలను కుటీర, చిన్న పరిశ్రమలశాఖ(ఎంఎస్ఎంఈ)లకు కేటాయించాలని చంద్రబాబు కలెక్టర్లకు సూచించారు. లబ్ధిదారులు నష్టపోకుండా వారికి నివాస యోగ్యమైన ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు హౌసింగ్‌శాఖ వద్ద ఉన్న వివరాల మేరకు.. జిల్లాలో 602 ఎకరాల ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ స్థలాలను ఎంఎస్ఎంఈల కింద ఔత్సాహికులైన చిన్న పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే వారికి కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా ఏర్పాటు చేస్తే అక్కడి ప్రజలకు ఉపాధి కూడా దొరికే ఆస్కారం ఉంది. దీనిపై జిల్లా అధికారులు హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కల్పించాల్సి ఉంది.

రోడ్లు, కమ్యూనిటీ స్థలాలు కలుపుకుంటే.. 602 ఎకరాలు

హౌసింగ్ లేఅవుట్లలో ఎకరాకు (100సెంట్లు) 60శాతం ఇంటి స్థలాలకు పోతే మిగిలిన 40శాతం రోడ్లు, కమ్యూనిటీ అవసరాలకు కేటాయించారు. ఈ లెక్కన జిల్లాలో 362.55 ఎకరాల విస్తీర్ణంలో ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉంటే, ఈ కాలనీల్లో రోడ్లు, కమ్యూనిటి స్థలాలకు దాదాపు 240 ఎకరాలు ఎకరాలు విడిచిపెట్టారు. మొత్తం కలిపి చూస్తే జిల్లాలో దాదాపు 602 ఎకరాలు హౌసింగ్ కాలనీల్లో ఖాళీ స్థలం మిగిలి ఉంది.

యువకుల హల్‌చల్...ఇద్దరిపై దాడి




తీవ్రంగా గాయపడిన మల్లికార్జున, దేవరాజులు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెడ్డివారిపల్లికి వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మించే బ్రిడ్జి వద్ద సోమవారం అర్ధరాత్రి ముగ్గురు యువకులు ఇద్దరు కార్మికులపై దాడి చేశారు. రైల్వేకోడూరు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు రెడ్డివారిపల్లి బ్రిడ్జి పనులు చేస్తున్న కార్మికులు దేవరాజులు, మల్లికార్జునపై యువకులు దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతిలోని రుయాకు తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి




ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న దృశ్యం, మృతి చెందిన సుబ్రహ్మణ్యం

రాయచోటి-నేతాజీ సర్కిల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని మోటకట్ల శివాలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్.సుబ్రహ్మణ్యం (60) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మోటకట్ల గ్రామం రోడ్డువారిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం ద్విచక్రవాహనంలో శివాలయం నుంచి ఇంటికి వెళుతుండగా రాయచోటి నుంచి పీలేరు వైపు వెళుతున్న బొలేరో పికప్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆయనను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాదుల్లా తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



వెంకటరమణ మృతదేహం

నిమ్మనపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లిలో నివాసం ఉంటున్న వెంకటరమణ (56) సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే వెంకటరమణను మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అక్కడ పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేయగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచినట్లు తెలిపారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

కోడిపందెం స్థావరాలపై దాడులు

- 12 మంది అరెస్ట్
- 26 మోటార్ సైకిళ్లు, నగదు స్వాధీనం



పోలీసులు అరెస్టు చేసిన కోడిపందెంరాయుళ్లు

రాయచోటి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిగువ అబ్బవరం సమీపంలో కోడిపందెం స్థావరంపై మంగళవారం డ్రోన్ సహకారంతో రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి ఆధ్వర్యంలో ఎస్ఐలు జహీర్, బాలకృష్ణ దాడులు నిర్వహించి 12 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.25 వేల నగదుతో పాటు, 26 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెడ్డెమ్మ హుండీ ఆదాయం రూ.1.82 లక్షలు

గుర్రంకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మతల్లి హుండీని మంగళవారం దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. అమ్మ వారికి హుండీ ద్వారా రూ.1,82,701 నగదు వచ్చినట్లు దేవదాయ శాఖ అధికారి శశికుమార్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ సంప్రోక్షణకు అంకురార్పణ



పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు



ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండ రామాలయంలో ధ్వజస్తంభ సంప్రోక్షణకు అంకురార్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని బలిపీఠము, ధ్వజస్తంభం పీఠాలకు గతంలో అమర్చిన ఇత్తడి కవచాలు దెబ్బతినడంతో కొత్తగా అమర్చారు. ఇందుకుగాను గతనెల 27న కళాకర్షణ పూజలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ధ్వజస్తంభ సంప్రోక్షణకు అంకురార్పణ కార్యక్రమం అర్చకులు నిర్వహించారు. ముందుగా అర్చకులు వీణ రాఘవాచార్యులు, శ్రావణకుమార్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్ ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మధ్య రంగంలో ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమట్టిని సేకరించి యాగశాలకు తీసుకొచ్చారు. యాగశాలలో పుట్టమట్టికి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం నిర్వహించారు. బుధవారం ఉదయం 7 గంటలకు ధ్వజస్తంభ సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు హనుమంతయ్య, నవీన్‌కుమార్, మధు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డాగ్, బాంబ్ స్క్వాడ్ మాక్‌డ్రిల్



ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

పీలేరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం పోలీసులు పీలేరులో మాక్‌డ్రిల్ నిర్వహించారు. బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ పీలేరు ఏరియా ఆసుపత్రి, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో డ్రిల్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా పెట్టడమే కాకుండా అత్యవసర సమయాల్లో వ్యవహరించే తీరుపై స్థానిక పోలీసులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డ్రిల్ చేపట్టామన్నారు.

ఎన్‌పీసీఐతో ఆధార్ లింక్ చేసుకోవాలి

జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దీపం పథకం రెండో విడత (ఏప్రిల్, జూలై)కు సంబంధించి సబ్సిడీ మొత్తం లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాని అంశంపై, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి సుమతి మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో ఆధార్ నెంబర్ అనుసంధానం కాకపోవడంతోనే ఈ సమస్య ఏర్పడినట్లు గుర్తించామన్నారు. ఇన్‌యాక్టివైన, బ్యాంకు లింకేజీ లేని ఆధార్ నెంబర్ల కారణంగానే సబ్సిడీ జమ కాలేదని తెలిపారు. లబ్ధిదారుల వద్ద రెండు లేదా అంతకన్నా ఎక్కువ బ్యాంకు ఖాతాలు ఉండడంతో ఎన్‌పీసీఐలో ప్రాథమిక ఖాతా నిర్దేశం లేకపోవడం వల్ల సబ్సిడీ జమ కాకపోవడానికి కారణమని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

ఈ అంశంపై నిశిత పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ఆదేశించారు. జిల్లాలోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు తమ ఏజెన్సీ పరిధిలో సబ్సిడీ జమ కాని వారి వివరాలను సేకరించి ఒక ప్రత్యేక డ్రైవ్ ద్వారా తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు, లీడ్ బ్యాంక్ మేనేజర్లు హాజరయ్యారు.

ఉరేసుకుని యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె మండలం వేంపల్లెకు చెందిన హేమావతి, లేట్ శంకర దంపతుల కుమారుడు హిమగిరి (16) పదో తరగతి ఫెయిలై స్థానికంగా ఓ మెకానిక్ షెడ్డులో పనినేర్చుకోవడానికి వెళుతున్నాడు. రెండు రోజులుగా పనికి వెళ్లకపోవడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్థాపం చెంది ఇంట్లో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే తాలుకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ, కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

నరసింహస్వామికి పవిత్రాల సమర్పణ

గుర్రంకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి పవిత్రోత్సవాలను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రతి ఏటా టీటీడీ ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలను మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. టీటీడీ నుంచి వచ్చిన పవిత్ర మాలలకు శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించి పవిత్రాలను సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులకు వేద పండితులు స్నపనతిరుమంజన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం చేస్తున్న అర్చకులు

పంచాయతీల పురోగతిపై శిక్షణ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి-నేతాజీ సర్కిల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పురోగతి సూచిక 2.0పై మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లాలోని అన్ని శాఖల అధికారులకు డీపీవో రాధమ్మ ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ 2030 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు పంచాయతీరాజ్ సంస్థల సామర్థ్యాల పెంపు, పనితీరు పర్యవేక్షణకు పురోగతిరాజ్ మంత్రిత్వ శాఖ (ఎంవోపీఆర్) రూపొందించిన పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ పురోగతి సూచిక 2.0 సూచిక స్థానిక ప్రణాళికను జాతీయ స్థాయిలో ఉన్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీఎస్)తో అనుసంధానం చేయడానికి వ్యూహాత్మక సాధనంగా పనిచేస్తుందని, నిర్మాణాత్మక సంస్థాగత యంత్రాంగం ద్వారా వివిధ వనరులను, భాగస్వాములను ఏకీకృతం చేయిస్తూ స్థానిక డేటా పాయింట్ల నుంచి స్థానిక లక్ష్యాలను నిర్ణయించడానికి, థీమాటిక్ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను రూపొందించడానికి పురోగతి సూచిక 2.0 బేస్‌లైన్ డేటాను అందిస్తుందని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, వీటిపైన ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం దేవళంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. స్వస్థ నారీ.. సశక్త పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరంలో మధుమేహ పరీక్షలు, రక్తపోటు పరీక్షలు, టీబీ శాంపిల్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ఎప్పటికప్పుడు పల్లెల్లో పర్యటించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. డాక్టర్లు ఎప్పటికప్పుడు 104 ద్వారా గ్రామాల్లో పర్యటించి పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సభ్యులు ఆఫీసర్ జయరామయ్య, డాక్టర్ జియావుల్లా, ఎంపీహెచ్ఈవో దేవదానం, హెల్త్ సూపర్‌వైజర్లు మహమ్మద్‌బాషా, మణి, సరళాదేవి, రాజేంద్రప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

రాజంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27లో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి అక్టోబరు 7వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.గంగాధరన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 2026 ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి కడప జిల్లాలో చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేరుశనగ రైతులకు కూలీల దెబ్బ

- టమోటా పంట వైపే కూలీల మొగ్గు
- రెట్టింపవుతున్న పంట ఖర్చులు
- ఏడాదికేడాదికి తగ్గుతున్న వేరుశనగ సాగు

కురబలకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రధానంగా రైతన్నలు సాగు చేసే పంటలలో వేరుశనగకు ప్రత్యేకస్థానం ఉంది. పూర్తిగా వర్షంపైనే ఆధారపడి పంటను సాగు చేస్తారు. ఏడాదికేడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదైనా, కాకపోయినా రైతన్నలు పంట సాగుపై మొగ్గు చూపుతున్నారు. అయితే ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలకు కనీసం గిట్టుబాటు ధరలు లేకపోవడం, పంట ఖర్చులు పెరిగిపోవడంతో వరుస నష్టాలను చవిచూస్తున్నారు. ప్రతి ఏడాది సీజన్‌లో లాభాలను ఆర్జించవచ్చుననే గంపెడాశతో ఎదురుచూస్తున్న రైతన్నలకు నిరాశే ఎదురవుతుంది. దీంతో తీవ్ర నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితులు నెలకొనడంతో గత కొన్నేళ్లుగా పంట సాగు విస్తీర్ణం క్రమేణా తగ్గుతోంది. దీనికి తోడు పంటలో కలుపు తీయడానికి కూలీల కొరత ఏర్పడటంతో సాగు చేసిన పంట దిగుబడిని దక్కించుకోడానికి రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలోని పడమటి ప్రాంత మండలాలలో రైతన్నలు వ్యవసాయంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. ప్రధానంగా రైతన్నలు టమోటా, వేరుశెనగ, ఉల్లి తదితర పంటలను సాగు చేస్తారు. అయితే ఈ ఏడాది అదునులో వర్షం తక్కువగా నమోదు కావడంతో వేరుశనగ పంట సాగుపై రైతన్నలు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో విస్తీర్ణం బాగా తగ్గింది. సరైన సమయంలో సరిపడా విత్తనాలు లేకపోవడం, నాసిరకంగా విత్తన కాయలు ఉండటంతో రైతులు పెద్దగా మొగ్గు చూపలేదు. కురబలకోటలో 174 హెక్టార్లు, బి.కొత్తకోటలో 99 హెక్టార్లు, తంబళ్లపల్లెలో 227 హెక్టార్లు, ములకలచెరువులో 540 హెక్టార్లు, పీటీఎంలో 336 హెక్టార్లు, పెద్దమండ్యంలో 140 హెక్టార్ల పంటను రైతన్నలు సాగు చేశారు. కాగా వేలాది ఎకరాలు బీళ్ళు భూములుగా మారాయి.



కురబలకోటలో సాగు చేసిన వేరుశనగ

అయితే పంటలో కలుపు మొక్కలు బాగా పెరిగిపోవడంతో రైతన్నలు వాటిపై యుద్ధం చేయాల్సి వస్తోంది. కలుపు తీయడానికి కూలీలు దొరకడం లేదు. ప్రధానంగా టమోటాను భారీ స్థాయిలో సాగు చేయడంతో ఈ పరిస్థితి నెలకొన్నది. కాగా టమోటా పంటలో కూలీ పనులు చేయడానికి వెళితే కూలీలకు సాధరణ కూలీలతో పోల్చితే రెట్టింపు కూలీలు ఇవ్వడంతో పాటు, టిఫన్, భోజనం, కూల్‌డ్రింక్స్ తదితర వసతులను కల్పిస్తారు. దీంతో అటు వైపు కూలీలు మొగ్గు చూపుతున్నారు. దీంతో వేరుశెనగ రైతులు కూలీలు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. దీంతో తమ పొలాలలో కలుపు మొక్కలను తొలగించడానికి పనులకు వచ్చే కూలీలకు అదే తరహాలో కూలీలు, వసతులు కల్పించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో పంట దిగుబడి ఏమాత్రం చేతి అందుతుందో వేచి చూడాల్సి ఉంది.

విద్యార్థుల ప్రతిభ కళాశాలకే గర్వకారణం

● డీన్ డాక్టర్ మాధవ



షర్మిల, నితిన్, ప్రియాంక, హర్షవర్ధన్, సాయిదీప్తి, షకీన

పులివెందుల రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్) నిర్వహించిన పీజీ (ఏఐఈఈఏ) పరీక్షలో తమ విద్యార్థులు చూపిన ప్రతిభ కళాశాలకే గర్వకారణమని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.మాధవ తెలిపారు. ఈ ఏడాది ఐకార్ ప్రకటించిన ఫలితాల్లో ప్రియాంక అనే విద్యార్థినికి దేశ వ్యాప్తంగా మూడవ ర్యాంకు వచ్చిందన్నారు. అలాగే ఓబీసీ కేటగిరీలో సాయిదీప్తి 22వ ర్యాంకు, షర్మిల 42వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో షకీనా 43వ ర్యాంకు, హర్షవర్ధన్ 81వ ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో నితిన్ 24వ ర్యాంకు సాధించిరన్నారు. ఈ సందర్భంగా ప్రతిభచాటిన ఆరుగురు విద్యార్థులను, ఇటువంటి ఉత్తమ ఫలితాలకు కారణమైన కళాశాల అధ్యాపకులను డీన్ మాధవ, ఇతర అధ్యాపకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అంతర్జాతీయ సాహితీ సదస్సుకు వేంపల్లె గంగాధర్‌కు ఆహ్వానం



వేంపల్లె గంగాధర్ (ఫైల్)

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని భారతీయ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, కేంద్ర సాహిత్య అకాడమీ, బీహార్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సాహితీ సదస్సుకు తెలుగు భాషా విభాగం నుంచి జిల్లాకు చెందిన ప్రసిద్ధ సాహితీవేత్త, భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ వేంపల్లె గంగాధర్‌కు ఆహ్వానం అందింది. సెప్టెంబరు 25 నుంచి 28వ తేదీ వరకు బీహార్ రాజధానిపాట్నా నరంలో దేశ విదేశాలకు చెందిన పలువురు సాహిత్య సాంస్కృతిక కళాకారుల సదస్సు జరగనుంది. డాక్టర్ వేంపల్లె గంగాధర్ తనకథా సంపుటి మొలకల పున్నమి రచనకు 2011 కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకున్నారు. మూడు వారాలపాటు రాష్ట్రపతి భవన్‌లో విడిది చేసిన తొలి సాహిత్యకారుడిగా గుర్తింపు పొందారు. గంగమ్మ పూలు, దేవర శిల, గ్రీష్మ భూమి, పాపాఘ్ని కథలు, రావణవాహనం కథలు, నేల దిగిన వాన, యురేనియం పల్లె, తొలి తెలుగు శాసనం వంటి రచనలు చేసి ప్రశంసలందుకున్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రిలే దీక్షలు చేస్తున్న తెలుగునాడు కార్మిక సంఘం

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నారు. ఆర్టీపీపీలో 17వ తేదీ నుంచి వివిధ రూపాల్లో ఆందోళన కొనసాగుతోంది. మంగళవారం రిలే దీక్షల్లో భాగంగా రెండో రోజు పి.సూరిబాబు, వై.హరిచంద్రరెడ్డి, ఎం.రామాంజనేయులురెడ్డి, షేక్ షబ్బీర్, కే.వెంకటశివుడు కూర్చున్నారు. తెలంగాణా తరహాలో సంస్థలో విలీనం చేసి డైరెక్ట్‌గా పేమెంట్ ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు కార్మికులు, భూములు కోల్పోయిన వారిని వెంటనే పర్మనెంట్ చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మి కుల 2022 పీఆర్సీ అరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. బీఎంఎస్, ఓసీ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ అసోషియేషన్ వారు మద్దతుగా పాల్గొన్నారు.

బేకరీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



బేకరీలో తనిఖీలు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత

పులివెందుల రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని ఓ బేకరీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత మంగళశారం ఉదయం తనిఖీలు చేపట్టారు. బేకరీలో అన్ని రకాల పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన, పాడైపోయి అలాగే ఉంచిన పదార్థాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పులివెందులలో బెస్ట్ బేకరీలో చెడిపోయిన కేక్‌ను విక్రయించారని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో తనిఖీలు చేపట్టామన్నారు. బేకరీ లైసెన్స్, లేబర్ లైసెన్స్‌తో పాటు బేకరీలో అన్ని పదార్థాలను పరిశీలించి అనుమానం కలిగిన వాటిని ల్యాబ్‌కు పంపామన్నారు. ల్యాబ్ నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా బేకరీపై చర్యలు తీసుకుంటామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలో మున్సిపల్ కమిషనర్ రాముడు, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజోలి జలాశయాన్ని నిర్మించాలి

● భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి

జమ్మలమడుగు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజోలి జలాశయాన్ని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిర్మించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దముడియం మండలంలోని పెద్దపసుపుల గ్రామం మాధవరాయస్వామి దేవాలయంలో గ్రామ, మండలస్థాయి శిక్షణ తరగతులు నిర్వహించి మాట్లాడారు. గతంలో రాజోలి జలాశయం నిర్మించి ఎకరాకు రూ.12లక్షలు పరిహారం ఇస్తామని చెప్పినప్పటికీ అప్పట్లో రైతులు ఒప్పుకోలేదన్నారు. ఎకరాకు రూ.20 లక్షలు పెంచి ఇవ్వాలని, రాజోలి జలాశయం నిర్మాణం ఆలస్యమైతే ఎకరా మెట్టభూమికి రూ.25 వేలు, మాగాని భూమికి రూ.40వేలు కౌలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా, గతంలో రాజోలి జలాశయం కోసం భూములు ఇచ్చిన పత్రాలు వెనక్కు ఇవ్వాలని, రాజోలి ముద్ర రద్దు చేయాలని, లేకపోతే రాజోలి జలాశయం నిర్మించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు రైతాంగ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే రాజోలి బాధిత రైతులు ఆందోళనబాట పట్టాల్సి వస్తోందని సహదేవరెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, కార్యదర్శి సుబ్బారెడ్డి, రాజోలి బాధిత రైతులు పాల్గొన్నారు.

వైవీయూలో నీటి కోసం కటకట



వైవీయూ న్యూ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్

కడపఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయం అంటే జ్ఞానాలయం. అక్కడ శాస్త్రీయ వాతావరణం, విద్యా విలువలతో పాటు కనీస సదుపాయాలు కూడా లభించాలి. కానీ వైవీయూ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో తాగునీరు లేకపోవడం విద్యార్థులు, అధ్యాపకులను దయనీయ పరిస్థితికి నెట్టేస్తోంది. ఇది ఒక సాధారణ సమస్యలా కనిపించినా దీని వెనుక ఉన్న నిర్లక్ష్యం మాత్రం పరిపాలన దౌర్బల్యాన్ని బట్టబయలు చేస్తోంది.

ప్రతిరోజు వందలాది మంది విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకులు ఈ బిల్డింగ్‌లో తిరుగుతుంటారు. అక్కడ ఫైల్ పనులు, బోధనతో పాటు పలు సమావేశాలు జరుగుతుంటాయి. కానీ తాగునీరులాంటి ప్రాథమిక సౌకర్యమే దొరకని పరిస్థితి. ఒక విశ్వవిద్యాలయం అధునాతన పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకొనే ముందు, తమ విద్యార్థులకు, అధ్యాపకులకు కనీస సౌకర్యాలుకల్పించగలగాలి. లేదంటే విశ్వవిద్యాలయం ప్రతిష్టే ప్రశ్నార్థకం అవుతుంది. విద్యార్థులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న ఈ సమస్య పరిపాలనలోని గజిబిజి, నిర్లక్ష్యాన్ని బయటపెడుతోంది. ఈ బిల్డింగ్‌లో మొత్తం మూడు డిపార్ట్‌మెంట్‌లు ఉన్నాయి. అలాగే అకౌంట్స్ సెక్షన్, మరికొన్ని పరిపాలనపరమైన సెక్షన్స్ ఉన్నాయి. ఇక్కడ విద్యార్థుల విద్యభ్యాసంతో పాటు సిబ్బంది కూడా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి తాగునీరులేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే బిల్డింగ్‌లో మాజీ వైస్ చాన్సలర్ కూడా విధులు నిర్వహించడం గమనార్హం. ఆయన కూడా ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారంటే వైవీయూలో విద్యార్థులకు ఎటువంటటి సౌకర్యాలు లభిస్తున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. చిన్నచిన్న సౌకర్యాల లోపాలను పరిష్కరించకపోతే, విద్యార్థులలో అసహనం పెరుగుతుంది. నీటి సౌకర్యం కల్పించలేని యూనివర్సిటీ బిల్డింగ్ జ్ఞానానికి ఇది ఎలాంటి ప్రతిబింబం అనే ప్రశ్న ప్రతి ఒక్కరి మనసులో మిగిలిపోతుంది. నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

వ్యవసాయంలో స్థిరమైన ఉత్పాదకత సాధించాలి

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చవచ్చని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం బోర్డు మీటింగ్ హాలులో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి కలెక్టర్ వ్యవసాయ అధికారులు, ఇఫ్కో(ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్స్ కో-ఆపరేటివ్ లిమిటెడ్) ప్రతినిధులు, సుస్థిర వ్యవసాయ కేంద్రం ప్రతినిధులు, నాబార్డు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో నూతన వ్యవసాయ పద్ధతులను అవలంభించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని తక్కువ ఖర్చుతో అధిక ఉత్పాదికత సాధించి రైతులు లాభాలు గడించేలా పని చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద వేముల, ఒంటిమిట్ట, వేంపల్లి మండలాల్లో ఇప్పటికే అరటి పంటల్లో ఈ పద్ధతిని అవలంబిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 1000 ఎకరాల్లో దాదాపు 500 మంది రైతులు ఈ విధానాన్ని పాటిస్తూ మంచి క్వాలిటీ పంటను ఉత్పత్తి చేస్తున్నారు. ఆ పంటలను గ్రామాల్లోనే విక్రయించేలా చర్యలు చేపట్టామన్నారు. రాబోయే కాలంలో వీటిని జిల్లా అంతా విస్తృతంగా అమలు చేసి సుస్థిర, స్థిరమైన ఉత్పాదకతను సాధించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మైక్రో ఇరిగేషన్ వ్యవసాయంలో కూడా ఆధునాతన పద్ధతులను అవలంభించి అరటితో పాటు పసుపు, చీనీలో ఈ విధానాన్ని పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు.

డ్రిప్ ఇరిగేషన్ సాగులో మొబైల్ అప్లికేషన్ ద్వారా వాటర్ మేనేజ్మెంట్, పవర్ మేనేజ్మెంట్ తదితర అంశాలకు సంబంధించిన పద్ధతులను ఆయన పరిశీలించారు. రైతులకు మార్కెట్ ధరలను అందుబాటులోకి తెచ్చి మరింత లాభపడేలా చర్యలు చేపట్టాలన్నారు. అరటి పంటలను అంతర్జాతీయ మార్కెట్‌లోకి తీసుకెళ్లి అత్యధిక లాభాలు చేకూర్చేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు నాబార్డు, ఇఫ్కో సుస్థిర వ్యవసాయ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ముందుగ ఇఫ్కో ప్రతినిధులు, సుస్థిర వ్యవసాయ కేంద్రం ప్రతి నిధులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను కలెక్టర్ వీక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్, ఏపీఎంఐపీ వెంకటేశ్వర్లు, నాబార్డు ఏజీఎం విజయ్ విహారీ, లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్ధన్, మైక్రో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలి

● ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య



మాట్లాడుతున్న డైరెక్టర్ గురవయ్య

కడప నాగరాజుపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలందించాలని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) గురవయ్య అధికారులకు సూచించారు. మంగళవారం కడపలోని ఈఈ కార్యాలయంలో కడప, వల్లూరు, పెండ్లిమర్రి, చింతకొమ్మదిన్నె, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో నష్టాలు అధికంగా ఉన్నాయని, వీటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సంతృప్తిస్థాయి కేవలం 59.53 శాతం మాత్రమే ఉందని, ఇది ఆందోళనకరమన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. లోఓల్టేజ్ సమస్య నివారణకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు దాడులు నిర్వహించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ, ఈఈలు హరిసేవ్యానాయక్, రమణారెడ్డి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రసన్నాంజనేయులు, ఏఈలు, జేఈలు, అకౌంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

: జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణను కలిసి వారు మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లందరికీ పెయిడ్ హాలిడేస్, ఐటీఐ విద్యార్హతలు ఉన్న వారికి పాత ఆపరేటర్‌తో సమానంగా జీతాలు ఇవ్వాలన్నారు. ప్రతి కార్మికుడికి భద్రతగా ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. ఇంకా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, సత్వరం పరిష్కరించాలని కోరామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, మైదుకూరు, పులివెందుల, డివిజన్‌ల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎస్ఐ, అతని కూతురిపై చీటింగ్ కేసు

కడపక్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) కడప నగరం హౌసిగ్‌బోర్డుకాలనీకి చెందిన విజయభాస్కర్‌రెడ్డికి ఆయిల్ ట్యాంకరులో భాగస్వామ్యం ఇస్తామని అతని వద్ద నుంచి రూ.కోటి 20 లక్షలు తీసుకోవడంతో పాటు ఆ డబ్బులు అడిగినందుకు అతనిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోద చేస్తామని బెదిరింపులకు పాల్పడిన రిటైర్డ్ ఎస్ఐ, అతని కుమార్తెలపై చీటింగ్ కేసుతో పాటు బెదిరింపు కేసు నమోదు చేసినట్లు కడప వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. విజయ భాస్కర్‌రెడ్డి కడపకు చెందిన రిటైర్డ్ ఎస్ఐ పెంచలయ్య స్నేహితులుగా ఉండేవారు. అయితే పెంచలయ్య తన కుమార్తె పేరు మీద ఆయిల్ ట్యాంకరు తీసుకుంటే సబ్సిడీ వస్తుందని, పెట్టుబడిగా డబ్బులు పెడితే మేనేజరుగా పెట్టి, పార్టనరుగా పెట్టుకుంటానని నమ్మించినట్లు తెలిపారు. దీంతో వారి మాట లు నమ్మి విజయభాస్కర్‌రెడ్డి 2012లో రూ.90లక్షలు, మరో మారు రూ.12లక్షలు ఇచ్చాడని.. ఇందుకు రెండు చెక్కులు పెద్దమనుషుల సమక్షంలో అగ్రిమెంట్లు రాసిచ్చినట్లు తెలిపారు. అప్పటి నుంచి విజయభాస్కర్‌రెడ్డి డబ్బులు ఇవ్వకుండా ఆయిల్ ట్యాంకరుకు పార్టనర్‌షిక్ ఇవ్వకుండా మోసం చేయడంతో పాటు డబ్బు తిరిగి ఇవ్వాలని అడగడంతో పెంచలయ్య, అతని కూతురు ఎస్సీఎస్టీ కేసులు పెడతామంటూ విజయభాస్కర్‌రెడ్డిని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తండ్రి కూతుర్లపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. బాలిక మృతి



స్వాతి మృతదేహం

స్వాతి (ఫైల్)

కొండాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తాపురం బస్‌స్టాప్ వద్ద మంగళవారం సాయింత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో స్వాతి (13) అనే బాలిక మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు బుక్కపట్నం గ్రామానికి చెందిన స్వాతి బస్‌స్టాప్ వద్ద నుంచి ఆవలి వైపునకు దాటు కుంటుండగా, వేగంగా గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొంది. దీంతో స్వాతి అక్కడిక్కడే మృతి చెందినట్లు తాళ్లప్రొద్దుటూరు ఏఎస్సై బాసు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా బుక్కపట్నం గ్రామానికి చెందిన అనిల్ కుమార్తె స్వాతి దత్తాపురం జడ్పీహైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతోంది. కుమార్తెను కోల్పోవడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

డ్రైనేజీ కాలువలో పడి ఉపాధ్యాయుడు మృతి



ఉపాధ్యాయుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న స్థానికులు



మధుబాబు (ఫైల్)

జమ్మలమడుగు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మునిసిపాలిటీ పరిధిలోని కన్నెలూరు మోటు పక్కన ఉన్న డ్రైనేజీ కాలువలో పడి పోసా మధుబాబు (52) అనే ఉపాధ్యాయుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... కన్నెలూరుకు చెందిన మధుబాబు పెద్దముడియం మండలం జె.కొట్టాలపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తు న్నారు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి వెళుతుండగా కన్నెలూరు మోటు వద్ద ప్రమాదవశాత్తు కాలుజారి మురుగునీటి కాలువలో పడి మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్‌బాబు తెలిపారు.

డాబాల్లో మద్యం తాగిస్తే చర్యలు తప్పవు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖాజీపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాబాల్లో, లాడ్జీల్లో, హోటళ్లలో మద్యం తాగినట్లు తెలిస్తే యజమానిపై శాఖాపరమైన చర్యలు తప్పవని సీఐ వంశీధర్ అన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఫుల్‌గా...' వార్త ప్రచురితం కావడంతో డాబా, లాడ్జీ, హోటల్ యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హైవేలో గల డాబాల్లో, లాడ్జీల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకూడదని, మరోసారి మద్యం తాగించి నట్లు తెలిసినా, రాత్రివేళల్లో నిర్ణీత సమయానికే మూయకపోయినా చర్యలు తప్పవన్నారు.ప్రమాదాలు జరుగకుండా నియంత్రించేందుకు మీలో కూడా చైతన్యం రావాలని పేర్కొన్నారు.

వైద్యశాఖలో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఎన్‌యూ హెచ్‌ఎం ప్రోగ్రామ్‌లో యూపీహెచ్‌సీలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేసేందుకు ఈనెల 29వ తేదీ సాయంత్రం గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు కడప ఏపీ.జీవో వి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. అలాగే ల్యాబ్ టెక్నీషీయన్, ఫార్మసిస్ట్, ఎఫ్ఎన్ఓ, శానిటరీ అటెండర్స్, టీబీ, హెల్త్ విజిటర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఫైనల్ మెరిట్ జాబితాను కడప వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు.

సెర్ప్ కార్యక్రమాలపై అవగాహన

కడప ఎన్టీఆర్‌సర్కిల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన సంస్థ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను అర్హులకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని సెర్ప్ సిబ్బందికి డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి దిశా నిర్దేశనం చేశారు. నగర శివారులోని టీటీడీసీ భవనంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బద్వేలు, పీడీ సెర్ప్ అమలు చేస్తున్న అన్ని రకాల కార్యక్రమాలపై రివ్యూ చేశారు. ఐబీ, బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, జీవనోపాదులు, హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఉన్నతి వంటి అన్ని రకాల పథకాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. అంతేకాక వివిధ యాప్, రిపోర్టులపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చారు. రాబోవు నాలుగు నెలలపైన కనబరిచిన అన్ని అంశాలను పూర్తి చేయాలని దిశ నిర్దేశనం చేశారు. కార్యక్రమంలో కమలాపురం, మైదుకూరు, కడప క్లస్టర్స్ వెలుగు సిబ్బంది, సీసీలు, డీపీఎం సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలోని ఇంటిలో చోరీ

దువ్వూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీప గంగమ్మ దేవాలయంలో ఆవరణలో ఉన్న ఇంటిలో చోరీ జరిగింది. గుర్తు తెలియని ఇంటిలోని బీరువాను పగులకొట్టి అందులో ఉన్న ముక్కుపుడక, వెండి ఊయల అపహరించారు. ఈమేరకు మంగళవారం ఆలయ నిర్వాహకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ భూషణం, సిబ్బంది ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు.

సోలార్ కంపెనీలో దొంగతనం

కొండాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు వద్ద నున్న సోలార్ కంపెనీలో చోరీ జరిగినట్లు తాళ్లప్రొద్దుటూరు ఏఎస్సై బాసు తెలిపారు. సోమవారం రాత్రి కంపెనీకి చెందిన పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు అప హరించినట్లు కంపెనీ సిబ్బంది ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.


రాయచోటి: లలితాదేవి అలంకారంలో దాక్షాయణి


రాజంపేట: కామాక్షిదేవి అలంకారంలో చౌడేశ్వరి


రైల్వేకోడూరు: జగన్మోహినిగా వాసవీ కన్యకాపరమేశ్వరి


రామాపురం:దుర్గాభవానిగా దర్గా మాతాజీ


సుండుపల్లె: గాయత్రీదేవిగా కన్యకాపరమేశ్వరి


ఒంటిమిట్ట రాజ రాజేశ్వరి అలంకారంలో వాసవి

భగవతీ.. పూర్ణేందు బింబాననా..

శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం అన్ని ప్రాంతాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను అనుగ్రహించారు. పలువురు భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు

రాయచోటిటౌన్, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో మంగళవారం అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గాంధీబజారులో కన్యకాపరమేశ్వరి అన్నపూర్ణగా, కొత్తపేట రామాపురంలో చౌడేశ్వరి బాలత్రిపుర సుందరిగా, అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రాయచోటి-నేతాజీ సర్కిల్ : పట్టణంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలోఅమ్మవారు పార్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

రామాపురం: మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీలోని దర్బారు సాయినగర్‌లో భవానీదేవి అలంకారంలో దర్గా మాతాజీ ప్రజలకు దర్శనమిచ్చింది.

రైల్వేకోడూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారు జగన్మోహిని అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ గునిశెట్టి రమేష్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె: మండల కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో వాసవి కన్యకాపమేశ్వరి పార్వతిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. బుధవారం గజలక్ష్మీదేవి అలంకారంలో దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్ తెలిపారు.

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో వాసవి మాత రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సోమిశెట్టి మనోహర్‌బాబు, తుమ్మలపెంట శ్రీనివాసులు, రెంటాల హరి, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: పట్టణంలో కన్యకాపరమేశ్వరిని బిల్వవృక్ష నివాసినిగా, చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారిని కామాక్షి గా, సాధు కామాక్షమ్మ ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరిగగా, ఉదయగిరి యల్లమ్మ ఆలయంలో బ్రహ్మచారిణిగా అమ్మవారిని అలంకరించారు..

వీరబలి : మండల కేంద్రంలో గంగమ్మ గాయత్రి అలంకారంలో దర్శనమిచ్చారు.

సీఎంను కలిసిన పోతుగుంట


ముఖ్యమంత్రికి ప్రసాదాలను అందజేస్తున్న పోతుగుంట రమేష్‌నాయుడు

రాజంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును విజయవాడలోని తన కార్యాలయంలో శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. స్వామివారి వస్త్రం, ప్రసాదాలను ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బాధ్యతాయుతంగా పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ సామాన్య భక్తులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ సందర్భంగా పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ తనకు శ్రీశైలం ఆలయ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌లకు, బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకులకు పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఎస్పీడీసీఎల్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీఎస్‌లో బ్రేకర్ మరమ్మతుల కారణంగా లక్కిరెడ్డిపల్లె మండలంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన తెలిపారు.

రామాపురం మండలంలో..

రామాపురం : రామాపురం మండల పరిధిలోని కుమ్మరపల్లి పంచాయతీ సూరకవాండ్లపల్లె 132 కేవీ సబ్‌స్టేషన్‌లో 33 కేవీ లైన్ బ్రేకర్ మారుస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతందని రామాపురం ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. రామాపురం మండల విద్యుత్ వినియోగదారులందరూ విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించగలరని ఆయన కోరారు.

సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం


మాట్లాడుతున్న ఏపీవో మురళి

నందలూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉపాధిహామీ కార్యాలయంలో మంగళవారం 20వ విడత సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సోషల్ ఆడిట్ సిబ్బంది, ఉపాధి సిబ్బంది, కన్వర్జెన్స్ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీవో మురళీ మాట్లాడుతూ మండలంలోని 14 పంచాయతీ లకు సంబంధించిన అన్ని రికార్డు వివరాలను సేకరించామన్నారు. ఆడిట్ సిబ్బంది సర్పంచ్ ఇతర ప్రజా ప్రతినిధులను కలిసి ఆడిట్ ప్రారంభించాలని తెలియజేశారు. ప్రతి గ్రామసభలో జరిగిన ఆడిట్‌పైన గ్రామసభ నిర్వహిస్తారు. ఈ గ్రామ సభకు సర్పంచ్, సెక్రటరీలు తప్పనిసరిగా హాజరు కావాలని తెలియజేశారు.

సమ్మెకు పీహెచ్‌సీ వైద్యులు సిద్ధం!

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మెకు సన్నద్ధమతున్నామని ఓబులవారిపల్లె ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఇన్ సర్వీస్ పీజీ కోటాపునరుద్ధరణ, టైమ్-బౌండ్ ప్రమోషన్ల అమలు, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్‌పై 50 శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రాం కింద రూ.5 వేలు అలవెన్స్, నేటివిటీ అర్బన్ ఎలిజిబిలిటి సమస్యల పరిష్కారం వంటి అంశాలను అసోసియేషన్ ద్వారా జిల్లా అదికారులకు విన్నవించామని తెలిపారు. వైద్యులకు ఖచ్చితమైన పని గంటలు, వారాంతపు సెలవులు, స్పష్టమైన జాబ్ చార్ట్ తదితర అంశాలపై మార్గదర్శకాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తగినంత మంది స్టాఫ్ నర్సులు లేకపోయినా వైద్యులు ఎదుర్కొంటున్న కఠిన పరిస్థితులను ప్రభుత్వం గమనించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి

నందలూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని ఎన్‌ఎస్ఎస్ పీవో డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి తెలిపారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నందలూరు గ్రామ పంచాయతీలోని అరుంధతివాడలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ క్యాంపులో అన్నమాచార్య ఇంజనీరింగ్ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కలిగించారన్నారు. దేశ భవిత యువత మీదనే ఆధారపడి ఉందని, ఇలా యువకులు సామాజిక సేవలో పాల్గొనడం శుభపరిణామమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు వ్యాక్సినేషన్ తప్పనిసరి


గర్భిణులకు సీమంతం చేస్తున్న వైద్యాధికారి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లలకు వ్యాక్సినేషన్ తప్పనిసరి అని వైద్యాధికారులు భావన అరుణజ్యోతి తెలిపారు. మంగళవారం మండలంలోని సాలా బాదు, రాచపల్లెల్లో ఆయా గ్రామ సర్పంచులు స్వరలత, మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో స్వస్థ్ సశక్త పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పంటి, కంటి, క్యాన్సర్, సికిల్‌సెల్, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూర్‌వైజర్ సుగుణ ఆధ్వర్యంలో సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు లక్ష్మీనరసమ్మ, సీహెచ్‌వో శిరీషా, చంద్రిక ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఇండియా హాకథాన్-2025 ఐడియాస్ సెలక్షన్

రాజంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ ఈ సాయిబాబారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం స్మార్ట్ ఇండియా హాకథాన్ కోసం ఐడియాస్ సెలక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ పబ్లిక్ సెక్టార్లలో 95 సమస్యలకు పరిష్కారాలు అవసరమన్నారు. ఈ సమస్యలకు పరిష్కారాలను కనుగొనేందుకు భారత ప్రభుత్వం హాకథాన్‌ను ప్రారంభించిందన్నారు. హాకథాన్‌లో అభివృద్ధి చేసే ఐడియాలు సమాజంలో ఉన్న వాస్తవ సమస్యలను పరిష్కరించడానికి స్టార్టప్‌లు, కొత్త ఉత్ప త్తుల రూపంలో ఆవిష్కృతం అవుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన 100 ఐడియాల్లో అత్యుత్తమ ఆలోచనలను ఎంపిక చేసి హాకథాన్‌కు అందజేస్తామన్నారు. ఎంపికైన ఐడియాలకు భవిష్యత్‌లో ప్రభుత్వ పరిశ్రమల నుంచి మెంటార్‌షిప్ లభించే అవకాశాలున్నాయన్నారు. ఉత్తమ ఐడియాకు భారత ప్రభుత్వం రూ.లక్ష నగదు బహుమతి అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ విద్యార్థులు ఇచ్చిన ఆలోచనలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.హరికృష్ణ, డీన్‌లు, హెడ్ ఆఫ్ ద డిపార్టుమెంట్స్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మకో విజిలెన్స్ ఉత్సవాలతో విజ్ఞానం

రాజంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఫార్మకో విజిలెన్స్ ఉత్సవాలు విద్యార్థిలో విజ్ఞానాన్ని పెంపొదిస్తాయని వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి తెలిపారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.స్వర్ణలత ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాల్లో వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, వైస్ ఛాన్సలర్ ఈ సాయిబాబారెడ్డిలు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా పలు సదస్సుల్లో పాల్గొని తమవంతు పాత్ర పోషించి వారి వృత్తి, అభివృద్ధికి సహకరించాలని కోరారు. స్లోగన్స్ విభాగంలో ఫార్మడీ 5వ సంవత్సరం విద్యార్థి ఆర్.వర్షిని మొదటి బహుమతి, టి.వినోద్‌కుమార్. కె.వంశీకృష్ణ, టివిశ్వతేజ బృందం రెండో బహుమతి, పోస్టర్ ప్రదర్శనలో ఫార్మాడీ నాలుగో సంవత్సరం విద్యార్థి కె.వంశీకృష్ణ మొదటి బహుమతి, మూడో సంవత్సరం విద్యార్థిని కె.శిల్ప రెండో బహుమతి, క్విజ్ పోటీల్లో యూస్ దిల్దార్ జహాన్, ఎస్.అప్సనా పొందగా, రీల్స్ పోటీల్లో టి.ప్రవీణ్‌రాయి మొదటి బహుమతి, ఏంజెల్ రెండో బహుమతిని సాధించారు. మీమ్స్ పోటీలో ఎస్.సౌమ్య, సి.సాయి సుకీర్తన్‌రెడ్డి, క్విట్ పోటీల్లో కె.వంశీకృష్ణ, పి.పవన్‌కుమార్, జె.విశ్వతేజ, పి.శివ సోనియా ఎస్.అప్సనా, ఎస్.సర్వర్, వి.భాను, బి.లిఖిత, డీప లక్ష్మీ, ఎస్.సుబ్రత్, యశస్ షహింతాజ్, ఎన్.కళ్యాణి, సి.జమున 2వ బహుమతి గెలుచుకున్నారు.

రూ.54 కోట్లతో వంతెనకు ప్రతిపాదనలు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండలంలోని మాచుపల్లి - ఖాదర్ బంగ్లా పెన్నానదిపై నూతన వంతెన నిర్మాణానికి రూ.54 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఆర్ అండ్ బీ ఏఈ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం పెన్నానది వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లు చిన్న పిచ్చిరెడ్డి, అన్నారెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్లి - రెడ్డివారిపల్లె రోడ్డుకు మరమ్మతులు

వీరబల్లి, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): వీరబల్లి మండలం మట్లి గ్రామ పంచాయతీ మట్లి కోదండ రామాలయం గుడి నుంచి రెడ్డివారిపల్లె వెళ్లే మాండవ్యనది ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డు తెగిపోయింది. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు రాజంపేటనియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి ఆ విషయాన్ని అధికారులకు తెలియజేశారు. దీంతో అధికారులు వెంటనే పనులను ప్రారంభించి మంగళవారం మధ్యాహ్నానికి పని పూర్తి చేయడంతో, రెండు గ్రామాల మధ్య నిరంతరాయంలో వాహనాల రాకపోకలకు అవకాశం ఏర్పడింది. సమస్య తెలిసిన వెంటనే పరిష్కారానికి కృషి చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తికి, అధికారులకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించా లంటూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నాయకులు మంగళవారం జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దార్ల రాజశేఖర్, జక్కల వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగం తీవ్ర స్థాయికి చేరుకుందని, లక్షలాది మంది యువత తగిన ఉద్యోగాలు లభించక, నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి నెలకు 3 వేలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, లెక్చరర్, టీచింగ్, నాన్ టీచింగ్, లైబ్రరీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వలంటరీ వ్యవస్థను పునరుద్ధరించి వారికి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, విద్యార్హత ఆధారంగా వారికి ప్రభుత్వ ఉద్యోగాల భర్తీల్లో ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి


పిల్లలకు అన్నప్రాసన చేయిస్తున్న సీడీపీవో జహరాబీ

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పిల్లలు బాగా ఎదగాలంటే మంచి పోషకాహారాన్ని అందించాలని సీడీపీవో జహరాబీ తెలిపారు. పోషణ మాసోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక బాలసుబ్రమణ్యం ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు అన్నప్రాసన, పోషకాహార ప్రదర్శన, గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పిల్లలకు ఎక్కువగా పెట్టాలన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు అందించాలని తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం ఇతర పదార్థాలు పిల్లలకు సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, దాద్వి, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై బీఎల్‌వోలతో సమావేశం


మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి

రాయచోటి-నేతాజీ సర్కిల్, సెప్టెంబరు 2 3(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో ఓటర్ల గుర్తింపుపై బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించినట్లు తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2002 ఓటరు జాబితా, 2025 ఓటరు జాబితాలోని ఓటర్లకు కచ్చితంగా గుర్తించాలని బీఎల్‌వోలకు తెలియజేశారు. ఇందుకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వారీగా చేపట్టాల్సిన పలు అంశాలను తెలియజేశారు. మండల వ్యాప్తంగా పక్కాగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో హుస్సేన్‌సాహెబ్, ఆర్ఐ శ్రీనివాసులునాయక్, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

'దెబ్బతిన్న రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేస్తాం'

సుండుపల్లె, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేస్తామని ఆర్అండ్‌బీ ఏఈ కుమార్‌బాబు మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని కె నరా బ్యాంక్ ఎదురుగా ఉన్న రో డ్డుపై మురుగునీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు చెప్పడంతో ఆయన పరిశీలించారు. వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేసి సమస్య పరిష్కరిస్తామని ఏఈ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాంనాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షులు సురేశ్‌నాయుడు, టీడీపీ రైతు విభాగం నాయకులు సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

'భవన నిర్మాణ'బోర్డుపై తీర్మానం చేయాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గంగాధర్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు విషయంపై అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు పట్టుపట్టాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన బోర్డును నిర్వీర్యం చేస్తూ 2019 లో జీవో నెం. 1214 ను విడుదల చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 46 వేల మందికి పైగా పెండింగ్ క్లయింలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు జోక్యం చేసుకుని భవన నిర్మాణ సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాండురంగయ్య, మల్లికార్జున, నరసింహులు, భాస్కర్, హరి, పురుషోత్తం పాల్గొన్నారు.

జీతాలు పెంచమంటే.. పని గంటలు పెంచుతారా?



మీడియాతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు జీతాలు పెంచమంటే పని గంటలు పెంచారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం రైల్వేకోడూరు సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పని గంటలను పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ద్రోహం చేస్తూ ఈ చట్టాన్ని తీసుకు వచ్చారని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్ అంశాలు సరైన సమయంలో ప్రభుత్వాలను కోలుకోలేని దెబ్బతీస్తాయ న్నారు. ఇప్పటికైనా కార్మిక వ్యతిరేక విధానాన్ని ఉపసంహరించుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగాల యానాదయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'ఆయుర్వేదంతో వ్యాధులు మటుమాయం'


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద మందులతో పలు వ్యాధులు నయమవుతాయని రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యం. భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాలలో ఆయుర్వేదిక్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాల వృక్షశాస్త్రం అధ్యాపకుడు డాక్టర్ కే. రమేశ్ మాట్లాడుతూ ఆయుర్వేద ఆవశ్యకత, రోగ నిరోధక ప్రభావం వివరించారు.

కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రమేష్ మాట్లాడుతూ పూర్వీకులు ఆయుర్వేదం ద్వారా ఆయుష్ ను పెంచుకోవడం జరిగిందన్నారు. రసాయన శాస్త్ర అధ్యాపకుడు కేపీ కృష్ణమూర్తి మాట్లాడుతూ వన మూలికల ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దాసరి మోషే, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు సద్వినియోగం చేసుకోవాలి


స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న సింగిల్‌విండో అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి

రామాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్‌కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సరస్వతిపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్లూరు పంచాయతీ చెనిక్యాయలపల్లిలో మంగళవారం 33 చౌకదుకాణ డీలర్ లక్ష్మయ్య స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ం ఈ స్మార్ట్ కార్డుతో ప్రతి లబ్ధిదారుడు 1వ తేదీ నుంచి నెల చివరి వరకు నిత్యావసర సరుకులు తీసుకెళ్లవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవదర్శన్‌రెడ్డి, సహదేవరెడ్డి, రామకృష్ణగౌడ్, గణేశ్, ప్రభాకర్, లక్ష్మయ్య, రామాంజనేయులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

గాలివీడు : నిత్యావసర సరుకులను సులభతరంగా ప్రజలకు పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్‌రేషన్ కార్డులను ప్రజలకు అందజేస్తోందని సర్పంచ్ పార్థసారథిరెడ్డి తెలిపారు. మంగళవారం పూలుకుంట గ్రామంలోని 3, 4, 5 ప్రభుత్వ చౌక దుకాణాల పరిధిలో కార్డుదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, యువగళం సాయిప్రసాద్‌రెడ్డి, ఎఫ్‌పీషాప్ డీలర్లు రెడ్డెప్పరెడ్డి, టోపీవలిసాబ్, గోపాలయ్య, ఎఫ్ఏ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఖాళీలు

వైసీపీ హయాంలో జగనన్న నవరత్నాలలో భాగంగా ఇబ్బడిముబ్బడిగా ఇళ్ల స్థలాలు కేటాయించారు. గ్రామాలు, పట్టణాలకు సుదూర ప్రాంతాల్లో రాళ్లు, గుట్టలు, కుంట స్థలాల్లో జగనన్న లేఅవుట్లు వేసి దరఖాస్తు చేసిన వారందరికీ ఒకటిన్నర సెంటు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించారు. నివాసయోగ్యం కాని ఈ స్థలాల్లో పట్టా పొందినా.. ఇంటి నిర్మాణాలు చేయలేక కొందరు, అనాసక్తితో ఇంకొందరు ఐదేళ్లు అయినా వాటిని పట్టించుకోలేదు. దీంతో జిల్లాలో వందలాది ఎకరాలు బీడు భూములను తలపిస్తున్నాయి.



- బీళ్లుగా జగనన్న కాలనీలు
- జిల్లాలో 602 ఎకరాలు ఖాళీ
- ఎంఎస్ఎంఈలకు కేటాయించేందుకు ప్రభుత్వం సన్నాహాలు
- లబ్ధిదారులకు మరోచోట ఇళ్ల స్థలాలు



మదనపల్లె మండలం పోతబోలు హౌసింగ్ కాలనీలో ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అడిగిన వారందరికి నవరత్నాల పథకం కింద దరఖాస్తు చేసిన 90 రోజుల్లోనే ఇంటి పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి పెంచారు. దీంతో రెవెన్యూ అధికారులు గ్రామాలు, పట్టణాలకు దూరంగా ఉన్న ప్రభుత్వ స్థలాలు, ప్రైవేటు స్థలాలను సేకరించి జగనన్న ఇళ్ల లేఅవుట్‌లు వేసి, అందులో లబ్ధిదారులకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. చాలా వరకు గుట్టలు, రాళ్లురప్పలు, కుంటలు ఉండే ప్రాంతాల్లోనే లేఅవుట్‌లు వేసి ఇచ్చారు. నివాసయోగ్యం కాని ఈ స్థలాలు తమకు వద్దంటూ అప్పట్లోనే లబ్ధిదారులు రోడ్డెక్కి నిరసనలు కూడా తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో 500 గ్రామ పంచాయతీల్లో మొత్తం 487 లేఅవుట్లు వేశారు. ఇందులో 57,618 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారు. వాస్తవంగా లబ్ధిదారులు అష్టకష్టాలు పడి వారికి కేటాయించిన ఒకటిన్నర సెంటు స్థలాల్లో అప్పులు చేసి పునాదులు, లింటెల్‌లెవెల్, మోల్డింగ్ దశల వరకు కొందరు ఇళ్లను నిర్మించుకున్నారు. కొందరు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి ఇళ్లలోకి చేరారు. ఇలా పునాదుల నుంచి ఇంటి నిర్మాణాలు పూర్తిచేసుకున్న వారి సంఖ్య 33,448 మాత్రమే. మిగిలిన 24,170 మందికి కేటాయించిన ఇళ్ల స్థలాలు ఖాళీగానే ఉన్నాయి. అంటే ఒక్కో లబ్ధిదారుడికి ఒకటిన్నర సెంటు ఇంటి స్థలం చొప్పున 24,170 మందికి కేటాయించిన 36,255 సెంట్లు అంటే 362.55 ఎకరాలు హౌసింగ్ కాలనీల్లో ఖాళీగా వెక్కిరిస్తూ కనిపిస్తూ ఉన్నాయి.

ఎంఎస్ఎంఈలకు స్థలాలు

విజయవాడలో ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు సరికొత్త నిర్ణయాలు తీసుకున్నారు. వైసీపీ పాలనలో తీసుకుని సరిగా అమలుకాని నిర్ణయాలను మార్చి భవిష్యత్ ఉపయోగాలకు, ఆర్థికంగా ఎదిగేందుకు విధి, విధానాలను రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా జగనన్న లేఅవుట్లలో నివాసయోగ్యం కాని ఇళ్ల స్థలాలు, పునాదులు కూడా నిర్మించకుండా మిగిలిపోయిన ఇళ్ల స్థలాలను గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందులో భాగంగా ఇంటి పట్టా పొందిన లబ్ధిదారుడి అనుమతితో ఆ స్థలాలను వెనక్కి తీసుకుని, ఖాళీ స్థలాలను కుటీర, చిన్న పరిశ్రమలశాఖ(ఎంఎస్ఎంఈ)లకు కేటాయించాలని చంద్రబాబు కలెక్టర్లకు సూచించారు. లబ్ధిదారులు నష్టపోకుండా వారికి నివాస యోగ్యమైన ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు హౌసింగ్‌శాఖ వద్ద ఉన్న వివరాల మేరకు.. జిల్లాలో 602 ఎకరాల ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ స్థలాలను ఎంఎస్ఎంఈల కింద ఔత్సాహికులైన చిన్న పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే వారికి కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా ఏర్పాటు చేస్తే అక్కడి ప్రజలకు ఉపాధి కూడా దొరికే ఆస్కారం ఉంది. దీనిపై జిల్లా అధికారులు హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కల్పించాల్సి ఉంది.

రోడ్లు, కమ్యూనిటీ స్థలాలు కలుపుకుంటే.. 602 ఎకరాలు

హౌసింగ్ లేఅవుట్లలో ఎకరాకు (100సెంట్లు) 60శాతం ఇంటి స్థలాలకు పోతే మిగిలిన 40శాతం రోడ్లు, కమ్యూనిటీ అవసరాలకు కేటాయించారు. ఈ లెక్కన జిల్లాలో 362.55 ఎకరాల విస్తీర్ణంలో ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉంటే, ఈ కాలనీల్లో రోడ్లు, కమ్యూనిటి స్థలాలకు దాదాపు 240 ఎకరాలు ఎకరాలు విడిచిపెట్టారు. మొత్తం కలిపి చూస్తే జిల్లాలో దాదాపు 602 ఎకరాలు హౌసింగ్ కాలనీల్లో ఖాళీ స్థలం మిగిలి ఉంది.

యువకుల హల్‌చల్...ఇద్దరిపై దాడి



తీవ్రంగా గాయపడిన మల్లికార్జున, దేవరాజులు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెడ్డివారిపల్లికి వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మించే బ్రిడ్జి వద్ద సోమవారం అర్ధరాత్రి ముగ్గురు యువకులు ఇద్దరు కార్మికులపై దాడి చేశారు. రైల్వేకోడూరు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు రెడ్డివారిపల్లి బ్రిడ్జి పనులు చేస్తున్న కార్మికులు దేవరాజులు, మల్లికార్జునపై యువకులు దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతిలోని రుయాకు తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న దృశ్యం, మృతి చెందిన సుబ్రహ్మణ్యం

రాయచోటి-నేతాజీ సర్కిల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని మోటకట్ల శివాలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్.సుబ్రహ్మణ్యం (60) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మోటకట్ల గ్రామం రోడ్డువారిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం ద్విచక్రవాహనంలో శివాలయం నుంచి ఇంటికి వెళుతుండగా రాయచోటి నుంచి పీలేరు వైపు వెళుతున్న బొలేరో పికప్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆయనను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాదుల్లా తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



వెంకటరమణ మృతదేహం

నిమ్మనపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లిలో నివాసం ఉంటున్న వెంకటరమణ (56) సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే వెంకటరమణను మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అక్కడ పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేయగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచినట్లు తెలిపారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

కోడిపందెం స్థావరాలపై దాడులు

● 12 మంది అరెస్ట్ ● 26 మోటార్ సైకిళ్లు, నగదు స్వాధీనం



పోలీసులు అరెస్టు చేసిన కోడిపందెంరాయుళ్లు

రాయచోటి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిగువ అబ్బవరం సమీపంలో కోడిపందెం స్థావరంపై మంగళవారం డ్రోన్ సహకారంతో రాయచోటి అర్బన్ సీఐ బీటీ చలపతి ఆధ్వర్యంలో ఎస్ఐలు జహీర్, బాలకృష్ణ దాడులు నిర్వహించి 12 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.25 వేల నగదుతో పాటు, 26 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెడ్డెమ్మ హుండీ ఆదాయం రూ.1.82 లక్షలు

గుర్రంకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మతల్లి హుండీని మంగళవారం దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. అమ్మ వారికి హుండీ ద్వారా రూ.1,82,701 నగదు వచ్చినట్లు దేవదాయ శాఖ అధికారి శశికుమార్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ సంప్రోక్షణకు అంకురార్పణ



పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు



ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండ రామాలయంలో ధ్వజస్తంభ సంప్రోక్షణకు అంకురార్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని బలిపీఠము, ధ్వజస్తంభం పీఠాలకు గతంలో అమర్చిన ఇత్తడి కవచాలు దెబ్బతినడంతో కొత్తగా అమర్చారు. ఇందుకుగాను గతనెల 27న కళాకర్షణ పూజలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ధ్వజస్తంభ సంప్రోక్షణకు అంకురార్పణ కార్యక్రమం అర్చకులు నిర్వహించారు. ముందుగా అర్చకులు వీణ రాఘవాచార్యులు, శ్రావణకుమార్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్ ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మధ్య రంగంలో ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమట్టిని సేకరించి యాగశాలకు తీసుకొచ్చారు. యాగశాలలో పుట్టమట్టికి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం నిర్వహించారు. బుధవారం ఉదయం 7 గంటలకు ధ్వజస్తంభ సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు హనుమంతయ్య, నవీన్‌కుమార్, మధు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డాగ్, బాంబ్ స్క్వాడ్ మాక్‌డ్రిల్



ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

పీలేరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం పోలీసులు పీలేరులో మాక్‌డ్రిల్ నిర్వహించారు. బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ పీలేరు ఏరియా ఆసుపత్రి, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో డ్రిల్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా పెట్టడమే కాకుండా అత్యవసర సమయాల్లో వ్యవహరించే తీరుపై స్థానిక పోలీసులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డ్రిల్ చేపట్టామన్నారు.

ఎన్‌పీసీఐతో ఆధార్ లింక్ చేసుకోవాలి

జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దీపం పథకం రెండో విడత (ఏప్రిల్, జూలై)కు సంబంధించి సబ్సిడీ మొత్తం లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాని అంశంపై, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి సుమతి మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో ఆధార్ నెంబర్ అనుసంధానం కాకపోవడంతోనే ఈ సమస్య ఏర్పడినట్లు గుర్తించామన్నారు. ఇన్‌యాక్టివైన, బ్యాంకు లింకేజీ లేని ఆధార్ నెంబర్ల కారణంగానే సబ్సిడీ జమ కాలేదని తెలిపారు. లబ్ధిదారుల వద్ద రెండు లేదా అంతకన్నా ఎక్కువ బ్యాంకు ఖాతాలు ఉండడంతో ఎన్‌పీసీఐలో ప్రాథమిక ఖాతా నిర్దేశం లేకపోవడం వల్ల సబ్సిడీ జమ కాకపోవడానికి కారణమని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

ఈ అంశంపై నిశిత పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ఆదేశించారు. జిల్లాలోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు తమ ఏజెన్సీ పరిధిలో సబ్సిడీ జమ కాని వారి వివరాలను సేకరించి ఒక ప్రత్యేక డ్రైవ్ ద్వారా తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు, లీడ్ బ్యాంక్ మేనేజర్లు హాజరయ్యారు.

ఉరేసుకుని యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె మండలం వేంపల్లెకు చెందిన హేమావతి, లేట్ శంకర దంపతుల కుమారుడు హిమగిరి (16) పదో తరగతి ఫెయిలై స్థానికంగా ఓ మెకానిక్ షెడ్డులో పనినేర్చుకోవడానికి వెళుతున్నాడు. రెండు రోజులుగా పనికి వెళ్లకపోవడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్థాపం చెంది ఇంట్లో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే తాలుకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ, కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

నరసింహస్వామికి పవిత్రాల సమర్పణ

గుర్రంకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి పవిత్రోత్సవాలను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రతి ఏటా టీటీడీ ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలను మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. టీటీడీ నుంచి వచ్చిన పవిత్ర మాలలకు శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించి పవిత్రాలను సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులకు వేద పండితులు స్నపనతిరుమంజన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం చేస్తున్న అర్చకులు

పంచాయతీల పురోగతిపై శిక్షణ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి-నేతాజీ సర్కిల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పురోగతి సూచిక 2.0పై మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లాలోని అన్ని శాఖల అధికారులకు డీపీవో రాధమ్మ ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ 2030 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు పంచాయతీరాజ్ సంస్థల సామర్థ్యాల పెంపు, పనితీరు పర్యవేక్షణకు పురోగతిరాజ్ మంత్రిత్వ శాఖ (ఎంవోపీఆర్) రూపొందించిన పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ పురోగతి సూచిక 2.0 సూచిక స్థానిక ప్రణాళికను జాతీయ స్థాయిలో ఉన్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీఎస్)తో అనుసంధానం చేయడానికి వ్యూహాత్మక సాధనంగా పనిచేస్తుందని, నిర్మాణాత్మక సంస్థాగత యంత్రాంగం ద్వారా వివిధ వనరులను, భాగస్వాములను ఏకీకృతం చేయిస్తూ స్థానిక డేటా పాయింట్ల నుంచి స్థానిక లక్ష్యాలను నిర్ణయించడానికి, థీమాటిక్ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను రూపొందించడానికి పురోగతి సూచిక 2.0 బేస్‌లైన్ డేటాను అందిస్తుందని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, వీటిపైన ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం దేవళంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. స్వస్థ నారీ.. సశక్త పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరంలో మధుమేహ పరీక్షలు, రక్తపోటు పరీక్షలు, టీబీ శాంపిల్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ఎప్పటికప్పుడు పల్లెల్లో పర్యటించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. డాక్టర్లు ఎప్పటికప్పుడు 104 ద్వారా గ్రామాల్లో పర్యటించి పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సభ్యులు ఆఫీసర్ జయరామయ్య, డాక్టర్ జియావుల్లా, ఎంపీహెచ్‌ఈవో దేవదానం, హెల్త్ సూపర్‌వైజర్లు మహమ్మద్‌బాషా, మణి, సరళాదేవి, రాజేంద్రప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

రాజంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27లో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి అక్టోబరు 7వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.గంగాధరన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 2026 ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి కడప జిల్లాలో చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేరుశనగ రైతులకు కూలీల దెబ్బ

- *టమోటా పంట వైపే కూలీల మొగ్గు*
- *రెట్టింపవుతున్న పంట ఖర్చులు*
- *ఏడాదికేడాదికి తగ్గుతున్న వేరుశనగ సాగు*

కురబలకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రధానంగా రైతన్నలు సాగు చేసే పంటలలో వేరుశనగకు ప్రత్యేకస్థానం ఉంది. పూర్తిగా వర్షంపైనే ఆధారపడి పంటను సాగు చేస్తారు. ఏడాదికేడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదైనా, కాకపోయినా రైతన్నలు పంట సాగుపై మొగ్గు చూపుతున్నారు. అయితే ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలకు కనీసం గిట్టుబాటు ధరలు లేకపోవడం, పంట ఖర్చులు పెరిగిపోవడంతో వరుస నష్టాలను చవిచూస్తున్నారు. ప్రతి ఏడాది సీజన్‌లో లాభాలను ఆర్జించవచ్చుననే గంపెడాశతో ఎదురుచూస్తున్న రైతన్నలకు నిరాశే ఎదురవుతుంది. దీంతో తీవ్ర నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితులు నెలకొనడంతో గత కొన్నేళ్లుగా పంట సాగు విస్తీర్ణం క్రమేణా తగ్గుతోంది. దీనికి తోడు పంటలో కలుపు తీయడానికి కూలీల కొరత ఏర్పడటంతో సాగు చేసిన పంట దిగుబడిని దక్కించుకోడానికి రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలోని పడమటి ప్రాంత మండలాలలో రైతన్నలు వ్యవసాయంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. ప్రధానంగా రైతన్నలు టమోటా, వేరుశెనగ, ఉల్లి తదితర పంటలను సాగు చేస్తారు. అయితే ఈ ఏడాది అదునులో వర్షం తక్కువగా నమోదు కావడంతో వేరుశనగ పంట సాగుపై రైతన్నలు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో విస్తీర్ణం బాగా తగ్గింది. సరైన సమయంలో సరిపడా విత్తనాలు లేకపోవడం, నాసిరకంగా విత్తన కాయలు ఉండటంతో రైతులు పెద్దగా మొగ్గు చూపలేదు. కురబలకోటలో 174 హెక్టార్లు, బి.కొత్తకోటలో 99 హెక్టార్లు, తంబళ్లపల్లెలో 227 హెక్టార్లు, ములకలచెరువులో 540 హెక్టార్లు, పీటీఎంలో 336 హెక్టార్లు, పెద్దమండ్యంలో 140 హెక్టార్ల పంటను రైతన్నలు సాగు చేశారు. కాగా వేలాది ఎకరాలు బీళ్ళు భూములుగా మారాయి.

అయితే పంటలో కలుపు మొక్కలు బాగా పెరిగిపోవడంతో రైతన్నలు వాటిపై యుద్ధం చేయాల్సి వస్తోంది. కలుపు తీయడానికి కూలీలు దొరకడం లేదు. ప్రధానంగా టమోటాను భారీ స్థాయిలో సాగు చేయడంతో ఈ పరిస్థితి నెలకొన్నది. కాగా టమోటా పంటలో కూలీ పనులు చేయడానికి వెళితే కూలీలకు సాధరణ కూలీలతో పోల్చితే రెట్టింపు కూలీలు ఇవ్వడంతో పాటు, టిఫన్, భోజనం, కూల్‌డ్రింక్స్ తదితర వసతులను కల్పిస్తారు. దీంతో అటు వైపు కూలీలు మొగ్గు చూపుతున్నారు. దీంతో వేరుశెనగ రైతులు కూలీలు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. దీంతో తమ పొలాలలో కలుపు మొక్కలను తొలగించడానికి పనులకు వచ్చే కూలీలకు అదే తరహాలో కూలీలు, వసతులు కల్పించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో పంట దిగుబడి ఏమాత్రం చేతి అందుతుందో వేచి చూడాల్సి ఉంది.



కురబలకోటలో సాగు చేసిన వేరుశనగ

విద్యార్థుల ప్రతిభ కళాశాలకే గర్వకారణం

● డీన్ డాక్టర్ మాధవ



షర్మిల, నితిన్, ప్రియాంక, హర్షవర్దన్, సాయిదీప్తి, షకీన

పులివెందుల రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్) నిర్వహించిన పీజీ (ఏఐఈఈఏ) పరీక్షలో తమ విద్యార్థులు చూపిన ప్రతిభ కళాశాలకే గర్వకారణమని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.మాధవ తెలిపారు. ఈ ఏడాది ఐకార్ ప్రకటించిన ఫలితాల్లో ప్రియాంక అనే విద్యార్థినికి దేశ వ్యాప్తంగా మూడవ ర్యాంకు వచ్చిందన్నారు. అలాగే ఓబీసీ కేటగిరీలో సాయిదీప్తి 22వ ర్యాంకు, షర్మిల 42వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో షకీనా 43వ ర్యాంకు, హర్షవర్ధన్ 81వ ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో నితిన్ 24వ ర్యాంకు సాధించిరన్నారు. ఈ సందర్భంగా ప్రతిభచాటిన ఆరుగురు విద్యార్థులను, ఇటువంటి ఉత్తమ ఫలితాలకు కారణమైన కళాశాల అధ్యాపకులను డీన్ మాధవ, ఇతర అధ్యాపకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అంతర్జాతీయ సాహితీ సదస్సుకు వేంపల్లె గంగాధర్‌కు ఆహ్వానం



వేంపల్లె గంగాధర్ (ఫైల్)

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని భారతీయ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, కేంద్ర సాహిత్య అకాడమీ, బీహార్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సాహితీ సదస్సుకు తెలుగు భాషా విభాగం నుంచి జిల్లాకు చెందిన ప్రసిద్ధ సాహితీవేత్త, భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ వేంపల్లె గంగాధర్‌కు ఆహ్వానం అందింది. సెప్టెంబరు 25 నుంచి 28వ తేదీ వరకు బీహార్ రాజధానిపాట్నా నరంలో దేశ విదేశాలకు చెందిన పలువురు సాహిత్య సాంస్కృతిక కళాకారుల సదస్సు జరగనుంది. డాక్టర్ వేంపల్లె గంగాధర్ తనకథా సంపుటి మొలకల పున్నమి రచనకు 2011 కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకున్నారు. మూడు వారాలపాటు రాష్ట్రపతి భవన్‌లో విడిది చేసిన తొలి సాహిత్యకారుడిగా గుర్తింపు పొందారు. గంగమ్మ పూలు, దేవర శిల, గ్రీష్మ భూమి, పాపాఘ్ని కథలు, రావణవాహనం కథలు, నేల దిగిన వాన, యురేనియం పల్లె, తొలి తెలుగు శాసనం వంటి రచనలు చేసి ప్రశంసలందుకున్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రిలే దీక్షలు చేస్తున్న తెలుగునాడు కార్మిక సంఘం

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నారు. ఆర్టీపీపీలో 17వ తేదీ నుంచి వివిధ రూపాల్లో ఆందోళన కొనసాగుతోంది. మంగళవారం రిలే దీక్షల్లో భాగంగా రెండో రోజు పి.సూరిబాబు, వై.హరిచంద్రరెడ్డి, ఎం.రామాంజనేయులురెడ్డి, షేక్ షబ్బీర్, కే.వెంకటశివుడు కూర్చున్నారు. తెలంగాణా తరహాలో సంస్థలో వీలీనం చేసి డైరెక్ట్‌గా పేమెంట్ ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు కార్మికులు, భూములు కోల్పోయిన వారిని వెంటనే పర్మనెంట్ చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మి కుల 2022 పీఆర్సీ అరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. బీఎంఎస్, ఓసీ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ అసోషియేషన్ వారు మద్దతుగా పాల్గొన్నారు.

బేకరీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



బేకరీలో తనిఖీలు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత

పులివెందుల రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని ఓ బేకరీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత మంగళశారం ఉదయం తనిఖీలు చేపట్టారు. బేకరీలో అన్ని రకాల పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన, పాడైపోయి అలాగే ఉంచిన పదార్థాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పులివెందులలో బెస్ట్ బేకరీలో చెడిపోయిన కేక్‌ను విక్రయించారని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో తనిఖీలు చేపట్టామన్నారు. బేకరీ లైసెన్స్ లేబర్ లైసెన్స్‌తో పాటు బేకరీలో అన్ని పదార్థాలను పరిశీలించి అనుమానం కలిగిన వాటిని ల్యాబ్‌కు పంపామన్నారు. ల్యాబ్ నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా బేకరీపై చర్యలు తీసుకుంటామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలో మున్సిపల్ కమిషనర్ రాముడు, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజోలి జలాశయాన్ని నిర్మించాలి

● భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి

జమ్మలమడుగు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజోలి జలాశయాన్ని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిర్మించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దముడియం మండలంలోని పెద్దపసుపుల గ్రామం మాధవరాయస్వామి దేవాలయంలో గ్రామ, మండలస్థాయి శిక్షణ తరగతులు నిర్వహించి మాట్లాడారు. గతంలో రాజోలి జలాశయం నిర్మించి ఎకరాకు రూ.12లక్షలు పరిహారం ఇస్తామని చెప్పినప్పటికీ అప్పట్లో రైతులు ఒప్పుకోలేదన్నారు. ఎకరాకు రూ.20 లక్షలు పెంచి ఇవ్వాలని, రాజోలి జలాశయం నిర్మాణం ఆలస్యమైతే ఎకరా మెట్టభూమికి రూ.25 వేలు, మాగాని భూమికి రూ.40వేలు కౌలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా, గతంలో రాజోలి జలాశయం కోసం భూములు ఇచ్చిన పత్రాలు వెనక్కు ఇవ్వాలని, రాజోలి ముద్ర రద్దు చేయాలని, లేకపోతే రాజోలి జలాశయం నిర్మించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు రైతాంగ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే రాజోలి బాధిత రైతులు ఆందోళనబాట పట్టాల్సి వస్తోందని సహదేవరెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, కార్యదర్శి సుబ్బారెడ్డి, రాజోలి బాధిత రైతులు పాల్గొన్నారు.

వైవీయూలో నీటి కోసం కటకట



వైవీయూ న్యూ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్

కడపఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయం అంటే జ్ఞానాలయం. అక్కడ శాస్త్రీయ వాతావరణం, విద్యా విలువలతో పాటు కనీస సదుపాయాలు కూడా లభించాలి. కానీ వైవీయూ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో తాగునీరు లేకపోవడం విద్యార్థులు, అధ్యాపకులను దయనీయ పరిస్థితికి నెట్టేస్తోంది. ఇది ఒక సాధారణ సమస్యలా కనిపించినా దీని వెనుక ఉన్న నిర్లక్ష్యం మాత్రం పరిపాలన దౌర్బల్యాన్ని బట్టబయలు చేస్తోంది.

ప్రతిరోజు వందలాది మంది విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకులు ఈ బిల్డింగ్‌లో తిరుగుతుంటారు. అక్కడ ఫైల్ పనులు, బోధనతో పాటు పలు సమావేశాలు జరుగుతుంటాయి. కానీ తాగునీరులాంటి ప్రాథమిక సౌకర్యమే దొరకని పరిస్థితి. ఒక విశ్వవిద్యాలయం అధునాతన పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకొనే ముందు, తమ విద్యార్థులకు, అధ్యాపకులకు కనీస సౌకర్యాలుకల్పించగలగాలి. లేదంటే విశ్వవిద్యాలయం ప్రతిష్టే ప్రశ్నార్థకం అవుతుంది. విద్యార్థులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న ఈ సమస్య పరిపాలనలోని గజిబిజి, నిర్లక్ష్యాన్ని బయటపెడుతోంది. ఈ బిల్డింగ్‌లో మొత్తం మూడు డిపార్ట్‌మెంట్‌లు ఉన్నాయి. అలాగే అకౌంట్స్ సెక్షన్, మరికొన్ని పరిపాలనపరమైన సెక్షన్స్ ఉన్నాయి. ఇక్కడ విద్యార్థుల విద్యభ్యాసంతో పాటు సిబ్బంది కూడా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి తాగునీరులేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే బల్డింగ్‌లో మాజీ వైస్ చాన్సలర్ కూడా విధులు నిర్వహించడం గమనార్హం. ఆయన కూడా ఏమీ చేయలేన పరిస్థితిలో ఉన్నారంటే వైవీయూలో విద్యార్థులకు ఎటువంటటి సౌకర్యాలు లభిస్తున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. చిన్నచిన్న సౌకర్యాల లోపాలను పరిష్కరించకపోతే, విద్యార్థులలో అసహనం పెరుగుతుంది. నీటి సౌకర్యం కల్పించలేని యూనివర్సిటీ బిల్డింగ్ జ్ఞానానికి ఇది ఎలాంటి ప్రతిబింబం అనే ప్రశ్న ప్రతి ఒక్కరి మనసులో మిగిలిపోతుంది. నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

వ్యవసాయంలో స్థిరమైన ఉత్పాదకత సాధించాలి

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చవచ్చని కలెక్టర్ శ్రీధర్ చెరుకూ రి పేర్కొన్నారు. మంగళవారం బోర్డు మీటింగ్ హాలు లో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి కలెక్టర్ వ్యవసాయ అధికారులు, ఇఫ్కో(ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్స్ కో-ఆపరేటివ్ లిమిటెడ్) ప్రతినిధులు, సుస్థిర వ్యవసాయ కేంద్రం ప్రతినిధులు, నాబార్డు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో నూతన వ్యవసాయ పద్ధతులను అవలంభించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని తక్కువ ఖర్చుతో అధిక ఉత్పాదికత సాధించి రైతులు లాభాలు గడించేలా పని చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద వేముల, ఒంటిమిట్ట, వేంపల్లి మండలాల్లో ఇప్పటికే అరటి పంటల్లో ఈ పద్ధతిని అవలంబిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 1000 ఎకరాల్లో దాదాపు 500 మంది రైతులు ఈ విధానాన్ని పాటిస్తూ మంచి క్వాలిటీ పంటను ఉత్పత్తి చేస్తున్నారు. ఆ పంటలను గ్రామాల్లోనే విక్రయించేలా చర్యలు చేపట్టామన్నారు. రాబోయే కాలంలో వీటిని జిల్లా అంతా విస్తృతంగా అమలు చేసి సుస్థిర, స్థిరమైన ఉత్పాదకతను సాధించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మైక్రో ఇరిగేషన్ వ్యవసాయంలో కూడా ఆధునాతన పద్ధతులను అవలంభించి అరటితో పాటు పసుపు, చీనీలో ఈ విధానాన్ని పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు.

డ్రిప్ ఇరిగేషన్ సాగులో మొబైల్ అప్లికేషన్ ద్వారా వాటర్ మేనేజ్మెంట్, పవర్ మేనేజ్మెంట్ తదితర అంశాలకు సంబంధించిన పద్ధతులను ఆయన పరిశీలించారు. రైతులకు మార్కెట్ ధరలను అందుబాటులోకి తెచ్చి మరింత లాభపడేలా చర్యలు చేపట్టాలన్నారు. అరటి పంటలను అంతర్జాతీయ మార్కెట్‌లోకి తీసుకెళ్లి అత్యధిక లాభాలు చేకూర్చేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు నాబార్డు, ఇఫ్కో సుస్థిర వ్యవసాయ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ముందుగి ఇఫ్కో ప్రతినిధులు, సుస్థిర వ్యవసాయ కేంద్రం ప్రతి నిధులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను కలెక్టర్ వీక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ చంద్రానాయక్, ఏపీఎంఐపీ వెంకటేశ్వర్లు, నాబార్డు ఏజీఎం విజయ్ విహారీ, లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్ధన్, మైక్రో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలి

● ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య



మాట్లాడుతున్న డైరెక్టర్ గురవయ్య

కడప నాగరాజుపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలందించాలని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) గురవయ్య అధికారులకు సూచించారు. మంగళవారం కడపలోని ఈఈ కార్యాలయంలో కడప, వల్లూరు, పెండ్లిమర్రి, చింతకొమ్మదిన్నె, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో నష్టాలు అధికంగా ఉన్నాయని, వీటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సంతృప్తిస్థాయి కేవలం 59.53 శాతం మాత్రమే ఉందని, ఇది ఆందోళనకరమన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. లోఓల్టేజ్ సమస్య నివారణకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు దాడులు నిర్వహించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ, ఈఈలు హరిసేవ్యానాయక్, రమణారెడ్డి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రసన్నాంజనేయులు, ఏఈలు, జేఈలు, అకౌంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

: జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణను కలిసి వారు మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లందరికీ పెయిడ్ హాలిడేస్, ఐటీఐ విద్యార్హతలు ఉన్న వారికి పాత ఆపరేటర్‌తో సమానంగా జీతాలు ఇవ్వాలన్నారు. ప్రతి కార్మికుడికి భద్రతగా ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. ఇంకా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, సత్వరం పరిష్కరించాలని కోరామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, మైదుకూరు, పులివెందుల, డివిజన్‌ల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎస్ఐ, అతని కూతురిపై చీటింగ్ కేసు

కడపక్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) కడప నగరం హౌసిగ్ బోర్డుకాలనీకి చెందిన విజయభాస్కర్‌రెడ్డికి ఆయిల్ ట్యాంకరులో భాగస్వామ్యం ఇస్తామని అతని వద్ద నుంచి రూ.కోటి 20 లక్షలు తీసుకోవడంతో పాటు ఆ డబ్బులు అడిగినందుకు అతనిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోద చేస్తామని బెదిరింపులకు పాల్పడిన రిటైర్డ్ ఎస్ఐ, అతని కుమార్తెలపై చీటింగ్ కేసుతో పాటు బెదిరింపు కేసు నమోదు చేసినట్లు కడప వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. విజయభాస్కర్‌రెడ్డి కడపకు చెందిన రిటైర్డ్ ఎస్ఐ పెంచలయ్య స్నేహితులుగా ఉండేవారు. అయితే పెంచలయ్య తన కుమార్తె పేరు మీద ఆయిల్ ట్యాంకరు తీసుకుంటే సబ్సిడీ వస్తుందని, పెట్టుబడిగా డబ్బులు పెడితే మేనేజరుగా పెట్టి, పార్టనరుగా పెట్టుకుంటానని నమ్మించినట్లు తెలిపారు. దీంతో వారి మాట లు నమ్మి విజయభాస్కర్‌రెడ్డి 2012లో రూ.90లక్షలు, మరో మారు రూ.12లక్షలు ఇచ్చాడని.. ఇందుకు రెండు చెక్కులు పెద్దమనుషుల సమక్షంలో అగ్రిమెంట్లు రాసిచ్చినట్లు తెలిపారు. అప్పటి నుంచి విజయభాస్కర్‌రెడ్డి డబ్బులు ఇవ్వకుండా ఆయిల్ ట్యాంకరుకు పార్టనర్‌షిప్ ఇవ్వకుండా మోసం చేయడంతో పాటు డబ్బు తిరిగి ఇవ్వాలని అడగడంతో పెంచలయ్య, అతని కూతురు ఎస్సీఎస్టీ కేసులు పెడతామంటూ విజయభాస్కర్‌రెడ్డిని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తండ్రి కూతుర్లపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. బాలిక మృతి



స్వాతి మృతదేహం

స్వాతి (ఫైల్)

కొండాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తాపురం బస్‌స్టాప్ వద్ద మంగళవారం సాయింత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో స్వాతి (13) అనే బాలిక మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు బుక్కపట్నం గ్రామానికి చెందిన స్వాతి బస్‌స్టాప్ వద్ద నుంచి ఆవలి వైపునకు దాటు కుంటుండగా, వేగంగా గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొంది. దీంతో స్వాతి అక్కడిక్కడే మృతి చెందినట్లు తాళ్లప్రొద్దుటూరు ఏఎస్సై బాసు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా బుక్కపట్నం గ్రామానికి చెందిన అనిల్ కుమార్తె స్వాతి దత్తాపురం జడ్పీహైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతోంది. కుమార్తెను కోల్పోవడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

డ్రైనేజీ కాలువలో పడి ఉపాధ్యాయుడు మృతి



ఉపాధ్యాయుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న స్థానికులు



మధుబాబు (ఫైల్)

జమ్మలమడుగు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మునిసిపాలిటీ పరిధిలోని కన్నెలూరు మోటు పక్కన ఉన్న డ్రైనేజీ కాలువలో పడి పోసా మధుబాబు (52) అనే ఉపాధ్యాయుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... కన్నెలూరుకు చెందిన మధుబాబు పెద్దముడియం మండలం జె.కొట్టాలపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తు న్నారు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి వెళుతుండగా కన్నెలూరు మోటు వద్ద ప్రమాదవశాత్తు కాలుజారి మురుగునీటి కాలువలో పడి మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్‌బాబు తెలిపారు.

సెర్ప్ కార్యక్రమాలపై అవగాహన

కడప ఎన్టీఆర్‌సర్కిల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన సంస్థ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను అర్హులకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని సెర్ప్ సిబ్బందికి డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి దిశా నిర్దేశనం చేశారు. నగర శివారులోని టీటీడీసీ భవనంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బద్వేలు, పీడీ సెర్ప్ అమలు చేస్తున్న అన్నిరకాల కార్యక్రమాలపై రివ్యూ చేశారు. ఐబీ, బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, జీవనోపాధులు, హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఉన్నతి వంటి అన్నిరకాల పథకాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. కమలాపురం, మైదుకూరు, కడప క్లస్టర్స్ వెలుగు సీసీలు, డీపీఎం సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలోని ఇంటిలో చోరీ

దువ్వూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీప గంగమ్మ దేవాలయంలో ఆవరణలో ఉన్న ఇంటిలో చోరీ జరిగింది. గుర్తు తెలియని ఇంటిలోని బీరువాను పగులకొట్టి అందులో ఉన్న ముక్కుపుడక, వెండి ఊయల అపహరించారు. ఈమేరకు మంగళవారం ఆలయ నిర్వాహకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ భూషణం, సిబ్బంది ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు.

సోలార్ కంపెనీలో...

కొండాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు వద్దనున్న సోలార్ కంపెనీలో చోరీ జరిగినట్లు తాళ్లప్రొద్దుటూరు ఏఎస్సై బాసు తెలి పారు. సోమవారం రాత్రి కంపెనీకి చెంది న పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు కంపెనీ సిబ్బంది ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డాబాల్లో మద్యం తాగిస్తే చర్యలు తప్పవు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖాజీపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాబాల్లో, లాడ్జీల్లో, హోటళ్లలో మద్యం తాగినట్లు తెలిస్తే యజమానిపై శాఖాపరమైన చర్యలు తప్పవని సీఐ వంశీధర్ అన్నారు.మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఫుల్‌గా...' వార్త ప్రచురితం కావడంతో డాబా, లాడ్జీ, హోటల్ యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హైవేలో గల డాబాల్లో, లాడ్జీల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకూడదని, మరోసారి మద్యం తాగించి నట్లు తెలిసినా, రాత్రివేళల్లో నిర్ణీత సమయానికే మూయకపోయినా చర్యలు తప్పవన్నారు.ప్రమాదాలు జరుగకుండా నియంత్రించేందుకు మీలో కూడా చైతన్యం రావాలని పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో దాడి

పులివెందుల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై కుటుంబ కలహాలతో దాడి జరిగినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పట్టణంలోని యర్ర గుడిపల్లెకు చెందిన ఆనంద్ అనే వ్యక్తి జేఎన్టీయూ సమీ పంలో అనుమానాస్పదంగా గాయాలతో పడి ఉన్నార న్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా ఆనంద్‌కు బంధువైన లోమడ సురేంద్ర అనే వ్యక్తి కత్తితో దాడి చేసినట్లు తేలిందన్నారు. నిందితుడు సురేంద్రను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

పులివెందుల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని నగరిగుట్టకు చెందిన మహేష్ అనే వ్యక్తిపై దాడి జరిగినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. వివరాలిలా.. నగరిగుట్టకు చెందిన మహేష్‌ను శివతో పాటు వెంకటరమణ, అఖిల్, బబ్లు, మరో వ్యక్తి దాడి చేశారన్నారు. బాధితుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నూతన జీఎస్టీ విధానంతో లబ్ధి

పులివెందులరూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జీఎస్టీ విధానంతో పేద ప్రజలకు లబ్ధి చేకూరుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ ఇక నుంచి జీఎస్టీ కేవలం రెండు శ్లాబ్‌లలో 5శాతం లేదా 18శాతం మాత్రమే ఉంటుందన్నారు. దీనివల్ల వినియోగదారులకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని తెలిపారు.


వైద్యశాఖలో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఎన్‌యూహెచ్‌ఎం ప్రోగ్రామ్‌లో యూపీహెచ్‌సీలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేసేందుకు ఈనెల 29వ తేదీ సాయంత్రం గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు కడప ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. అలాగే ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, ఎఫ్ఎన్‌ఓ, శానిటరీ అటెండర్స్, టీబీ, హెల్త్ విజిటర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఫైనల్ మెరిట్ జాబితాను కడప వెబ్ సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు.

గాయత్రి అమ్మవారిగా..



పీలేరు రౌద్రాల అంకాళమ్మ ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



వాల్మీకిపురంలో గాయత్రీదేవి అలంకరణలో నల్లవీరగంగాభవాని అమ్మవారు



కలికిరిలో పార్వతీదేవిగా..



కురబలకోటలో గాయత్రీదేవిగా..



గాయత్రిదేవి అలంకరణలో రౌద్రాల అంకాళమ్మ

పీలేరు/పీలేరు రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పీలేరు గ్రామ దేవత రౌద్రాల అంకాళమ్మ గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రులతో పాటు అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో మంగళవారం మండలంలోని అమ్మవారి ఆలయాలకు మహిళలు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నెహ్రూ బజారులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు, మోడల్ కాలనీలోని ఎల్లమ్మ తల్లి, ఇందిరమ్మ కాలనీ సమీపంలోని దిన్నె గంగమ్మ ఆలయం, తలపుల సమీపంలోని ఉలవల గంగమ్మ, బండ్లవంకలోని నడివీధి గంగమ్మ, తిరుపతి మార్గంలోని చౌడేశ్వరిదేవీ, అగ్రహారం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రౌద్రాల అంకాళమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేశారు.

నల్లవీరగంగాభవాని ఆలయంలో..

వాల్మీకిపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వానరగుట్ట సమీపాన వెలసిన నల్లవీరగంగాభవాని ఆలయంలో, గండబోయనపల్లె కోటలో వెలసిన సత్యమ్మతల్లి ఆలయం, గొల్లపల్లెలో విరూపాక్షమ్మ ఆలయం, వాల్మీకి నగర్‌లోని బోయకొండ గంగమ్మ ఆలయాలలో గాయత్రీదేవిగా అలంకరణలు చేశారు. అలాగే స్థానిక కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరి దేవాలయంలో అమ్మవారు మీనాక్షిదేవిగా, బజారువీధిలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో పద్మావతిదేవిగా దర్శనమిచ్చారు. మండలంలోని చింతపర్తి గ్రామంలో తొలిసారిగా సుమారు ఏడు అడుగుల దుర్గమ్మతల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నవరాత్రుల వేడుకల అనంతరం అమ్మవారి ప్రతిమను 2వ తేదీన వైభవంగా నగరోత్సవం నిర్వహించి బాహుదానదిలో నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాలలో ఆలయాల ధర్మకర్తలు మొగ్రంరెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి, పులి సత్యారెడ్డి, కువైట్ శంకరాచారి, తబ్జూల సతీష్, కాంతరాజుశెట్టి, అర్చకులు గోనవరపు శీనాస్వామి, ఉత్తన్నస్వామి, జనార్దనస్వామి, ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కలికిరిలో..

కలికిరి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గాయత్రీదేవి అలంకారంలో కలికిరి యల్లమ్మ తల్లి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మంగళవారం ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సోమేశ్వరాలయంలో మహిషాసురమర్దిని అలంకారం ఏర్పాటు చేశారు. రాత్రి మహిళలు కుంకుమార్చనలు సమర్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



గుర్రంకొండలో..

గుర్రంకొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మ అమ్మవారు మంగళవారం గాయత్రీదేవిగా భక్తులను కటాక్షించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఉదయం అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అలాగే గుర్రంకొండ పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



బి.కొత్తకోటలో అమ్మవారి విగ్రహం వద్ద హారతిని అందుకుంటున్న భక్తులు

ములకలచెరువులో...

ములకలచెరువు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక పీటీఎం రోడ్డులో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కురబలకోటలో..

కురబలకోట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కురబలకోట కన్యకాపరమేశ్వరీ ఆలయంలో మంగళవారం అమ్మవారు గాయత్రీదేవీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నాగరాజగుప్త, రామకృష్ణ, బాలకృష్ణ సేతు మాధవ్, అమర్‌నాథ్, మారుతీ కుమార్, రామ్మోహన్, రాధారాణి, పుష్పలత, సరళ, అర్చకులు సత్యనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని శివాలయంలో మంగళవారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రులలో భాగంగా మంగళవారం అమ్మవారికి గాయత్రీదేవిగా ప్రత్యేక అలంకరణ చేశారు. జ్యోతి సర్కిల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

చౌడేశ్వరీదేవి ఆలయంలో...



సంతాన లక్ష్మిగా రాజరాజేశ్వరీదేవి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లెలో చౌడేశ్వరీదేవి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ప్రారంభమై అక్టోబరు 2తో ముగుస్తాయని ఆలయకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, ట్రెజరర్ పురాణం చంద్రశేఖర్, బండి పవన్‌కుమార్, రామిశెట్టి రత్నమయ్య పేర్కొన్నారు. ఆలయంలో జరిగిన తొలిపూజలో తొగటవీర క్షత్రియుల కులగురువు స్వామిజీ కర్నాటక రాష్ట్రంలోని చిలగట్ నుంచి వచ్చి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొగటవీర క్షత్రియులు ఐకమత్యంతో అన్ని విధాల అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం పసుపు అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు మోడెం వెంకటరమణ, ఉపాధ్యక్షులు మోడెం సిద్దప్ప,ఉప్పు రామచంద్ర, ఆర్ నీలకంఠ, బండి నాగరాజ, జి. లక్ష్మీనారాయణ, చినబాబు, కొరమట్ల నాగరాజ, ఆర్‌కే మోహన్, కమలమరి కృష్ణ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రామిశెట్టి ఆంజనేయులు, రమేష్‌బాబు, లోకేష్, ప్రభాకర్, కౌన్సిలర్లు ఎస్‌వీ రమణ, మందపల్లె వెంకటరమణ, రామిశెట్ట శివా, తదితరులు పాల్గొన్నారు. అలాగే కోర్టు ఆవరణంలోని కోర్టులో గంగమ్మకు, వాసవీ భవన్ వీధిలోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో, దేవళంవీధిలోని సోమేశ్వర స్వామి ఆలయంలో, దేవతా నగర్‌లోని రాజరాజేశ్వరీ ఆలయం లో విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ లు చేశారు. అనంతరం ఆలయంలో అన్నదానం, తీర్థప్రసాదాలు పంపిణీ, సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం గాయత్రిదేవి అలంకరణ, లలిత సహస్ర నామపారాయణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, ఉపాధ్యక్షుడు కరుణాకర్ నాయుడు, ట్రెజరర్ మార్వారి మహేష్, మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, కార్యదర్శి దేవతా సతీష్, ట్రెజరర్ సూరే గిరిధర్, ఆలయ ఈవో రమణ, సిబ్బంది అంకన్న, రాజశేఖర్ పాల్గొన్నారు.



హెచ్ 1బీ వీసాలపై ప్రధాని వైఖరి తెలపాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ, సీపీఎం నాయకులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకొచ్చిన హెచ్1బీ వీసాల ఆంక్షలపై ప్రధాని మోదీ తన వైఖరిని తెలపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్టీఆర్ సర్కిల్‌లోని కేఎఫ్‌సీ దుకాణం ఎదుట ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అమెరికాలో హెచ్1బీ వీసాల ఫీజును భారీగా పెంచి భారతీయులపై ఒత్తిడి పెంచారన్నారు. హెచ్1బీ వీసాల్లో 71శాతం భారతీయులే తీసుకుంటున్నారని, అలాంటి తరుణంలో ట్రంప్ నిర్ణయం భారతీయులను మనోవేదనకు గురిచేస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి హరీంద్రనాథ్‌శర్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ, నాయకులు సుల్తాన్, కార్తికేయ, చరణ్, ప్రవీణ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

రక్షణ విభాగంలో రోబోటిక్స్ పాత్ర కీలకం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ విభాగంలో రోబోటిక్స్ పాత్ర కీలకమని డీఆర్‌డీవో శాస్త్రవేత్త డి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంతరిక్షంలో, రక్షణ విభాగంలో, ఆధునిక టెక్నాలజీలో రోబోటిక్స్ పాత్ర గురించి వివరించారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవరుచుకోవాలన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల మీద పట్టుసాధిస్తే ఇస్రో, డీఆర్‌డీవో, బీఏఆర్‌సీ సంస్థల్లో ఉద్యోగావకాశాలు వున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి, అధ్యాపకులు కుసుమప్రియ, గురుమూర్తి, మోహనవల్లి, విష్ణుప్రియ, మోహన్‌బాబు, లీలా, విద్యార్థినులు పాల్గొన్నారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

తంబళ్లపల్లె, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రక్తాన్ని కృత్రిమంగా సృష్టించలేమని.. అందుకే రక్తదానం ప్రాణదానంతో సమానమని తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి తేజస్విని అన్నారు. స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒక్కసారి రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు అమరసింహరాజు, సుమలత, హెడ్ నర్సు గ్లోరి, బ్లడ్ బ్యాంకు టెక్నిషియన్ ధనుంజయ, సిబ్బంది చంద్రమోహన్, శ్యామల, సాయి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష తగదు

వాల్మీకిపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష తగదని ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారులు తెలిపారు. మంగళవారం స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ వైద్యశాలలో ఆర్ఆర్ఎస్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ చెడు మార్గాలకు దూరంగా ఉంటూ మంచి నడవడికతో విద్యార్థులు చదువుకోవాలన్నారు. అలాగే ఐఈసీ మొబైల్ వాహనం ద్వారా వీడియో లఘుచిత్రాలను ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి, డాక్టర్ శివాణి, ఆర్ఆర్ఎస్ మేనేజర్ పురుషోత్తం, ఐసీటీసీ కౌన్సిలర్ లోకేష్, ప్రభుత్వాస్పత్రి సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో..

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత చూపరాదని మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి అన్నారు. మంగళవారం ఆర్ఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏఈసీ మొబైల్ వ్యాన్ ద్వారా విద్యార్థులకు ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఆర్ఎస్ మేనేజరు, సిబ్బంది జనార్ధన్, కిరణ్, సమీరా పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతోనే ఆరోగ్య రక్షణ

తంబళ్లపల్లె, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ పోషణతోనే ఆరోగ్యానికి రక్షణ అని తంబళ్లపల్లె సీడీపీవో సుజాత అన్నారు. మంగళవారం కన్నెమడుగు, రెడ్డివారిపల్లెలో పోషణ మాసోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాలింతలు బిడ్డకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని, ఆ తర్వాత అదనపు ఆహారాన్ని అలవాటు చేయాలన్నారు. తల్లిపాలు ఇవ్వడం వలన కొన్ని జబ్బుల నుంచి కాపాడటమే కాకుండా తల్లీబిడ్డల అనుబంధం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రకాంత్, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గూడుపల్లె వీఆర్ఏ మృతి

ములకలచెరువు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడుపల్లె వీఆర్ఏ కొమ్మిరి జనార్దన్(45) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. గత కొన్నేళ్ళుగా అనారోగ్యంతో బాధపడుతున్న జనార్దన్ పరిస్థితి విషమించడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. జనార్దన్ భార్య శ్రావణి కూడా పదేళ్ల క్రితం మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీఆర్ఏ మృతదేహం వద్ద తహసీల్దార్ ప్రదీప్, డీటీ లక్ష్మీ, రెవెన్యూ సిబ్బంది నివాళులర్పించారు. ప్రభుత్వం తరపున తక్షణ సాయంగా రూ.25వేలు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తరపున రూ.36,500 ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబీకులకు అందజేశారు.

కోళ్ల ఫారాల వ్యర్థాలను తొలగించాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మరో 15 రోజుల్లోగా కోళ్ల ఫారాలలో ఉన్న వ్యర్థాలను తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో రమేష్ హెచ్చరించారు. రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లి సమీపంలో వున్న కోళ్ల ఫారాల నుండి వచ్చే ఈగలు, వాసనతో భరించలేకపోతున్నామని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆయన అధికారులతో కలసి కోళ్లఫారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఇరవై ఏళ్ల క్రితమే గ్రామ సమీపంలో కోళ్ల ఫారాలు వెలిశాయని, అయితే అప్పటి నుండి ఇప్పటి వరకు కోళ్ల వ్యర్థాలు, ఈగలు, వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కోళ్ల వ్యర్థాలపై వాలిన ఈగలు తిరిగి తాగునీటిలో చేరడం వలన నీరు కలుషితమై జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులు కోళ్ల ఫారాల నిర్వాహకులతో మాట్లాడి ఇరువురి సమక్షంలో 15రోజుల్లోగా ఫారాలలో వున్న కోళ్లను తొలగించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, ఆర్ఐ రమేష్, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్, అధికారులు

ఓటర్ల జాబితా పరిశీలనను పకడ్బందీగా చేయాలి

ములకలచెరువు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా పరిశీలనను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ ప్రదీప్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఆయన బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2022 ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్లు, ఇప్పటి జాబితాలో ఉండే ఓటర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఈనెల 26వ తేదీలోగా ఈ పరిశీలన కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీటీ లక్ష్మి, ఆర్ఐ సయ్యద్ ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా షుకూర్

బి.కొత్తకోట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట ఎంపీడీవోగా షుకూర్ నియమితులయ్యారు. మదనపల్లిలో డిప్యూటీ ఎంపీడీవోగా పని చేసున్న షుకూర్ పదోన్నతి పొందారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

13 మంది జూదరుల అరెస్టు

● రూ.40,400 నగదు స్వాధీనం

పెద్దమండ్యం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో జూదరుల స్థావరంపై సోమవారం అర్ధరాత్రి స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు చేశారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కలిచెర్ల-కోటకాడపల్లి కాలిబాట అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి జూదం ఆడుతున్నట్లు ఎస్పీ ధీరజ్ కునుబిల్లికి సమాచారం అందిందన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ పార్టీ పోలీసులు అర్ధరాత్రి దాడులు చేసి 13మంది జూదరులను అరెస్టు చేసి రూ.40.400, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరణ చేయాలి



చినబాబుకు వినపత్రం అందిస్తున్న వాల్మీకి మహాసేన సభ్యులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో పునరుద్ధరణ చేయాలని కోరుతూ మంగళవారం తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబుకు వాల్మీకి మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 30లక్షలకు పైగా వాల్మీకులు ఉన్నారని, వారి అభున్నతికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దేవరింటి సుధాకర్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చిప్పిలి చెంద్రాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను పరిశీలించిన డీఈ

బి.కొత్తకోట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట ఆనుకొని వున్న కానగలకుంట, పెద్దచెరువులను హంద్రీనీవా డీఈ ప్రశాంత్ మంగళవారం పరిశీలించారు. ఈ రెండు చెరువులను హంద్రీనీవా నీటితో నింపేందుకు శాశ్వత ప్రాతిపదికన పంప్‌హౌస్ నిర్మించాలని వినతులు వెళ్లడంతో హంద్రీనీవా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుకు తగిన ప్రతిపాదలు సిద్ధం చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు చెరువులు నిండుగా ఉంటే పట్టణానికి తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 23: మైనర్ల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని డిఎస్పీ మహేంద్ర తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రైవింగ్ చేస్తున్న సుమారు 50 మంది మైనర్లను మంగళవారం రాత్రి గుర్తించి వారి తల్లిదండ్రులకు విషయం తెలిపి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్ల డ్రైవింగ్ వలన రోడ్డుప్రమాదాల రూపంలో చాలామంది ప్రాణాలు కోల్పోతారన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్‌లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ తప్పక వాడాలని, రహదారి నియమాలను పాటించాలన్నారు. సీఐలు రాజారెడ్డి, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

'ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి'



నిరసన తెలుపుతున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

పీలేరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పుంగనూరులోని భాష్యం పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ డిమాండ్ చేశారు. భాష్యం పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న చిన్నారి సాత్విక నాగశ్రీని హోం వర్కు చేయలేదన్న కారణంతో ఆ పాఠశాల ఉపాధ్యాయుడు తలపై కొట్టడంతో ఆమెకు తీవ్ర గాయాలైన సంఘటన పాఠకులకు విదితమే. ఆ సంఘటనపై ఎన్ఎస్‌యూఐ శ్రేణులు మంగళవారం పీలేరు నాలుగు రోడ్ల కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అమృతతేజ మాట్లాడుతూ చిన్నారి సాత్విక నాగశ్రీ తల్లి ఒంటరి మహిళ అని, ఆమెను ఆదుకోవాల్సిన బాధ్యత ఆ పాఠశాల యాజమాన్యంతో పాటు విద్యాశాఖపై ఉందన్నారు. తన స్వంత జిల్లాలో జరిగిన ఈ సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి ఆర్థికసాయం అందించాలన్నారు. ఇంత వరకు భాష్యం పాఠశాలపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో జిల్లా విద్యాశాఖాధికారులపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయి సంపత్ కుమార్, లోకేశ్, యశ్వంత్, రాజేశ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రణభేరిని విజయవంతం చేయాలి



నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్థిక విద్యా రంగ సమస్యలపై గురువారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించే యూటీఎఫ్ రణభేరిని విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఆర్థిక విద్యారంగ సమస్యలపై వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శులు సుధాకర్ నాయుడు, పురం వెంకటరమణ, ఆదినారాయణ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్‌సీ కమిషన్ వేసి ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఏ విడుదల చేయాలని, రాష్ట్ర విద్యావిధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠ శాలలో సమాంతర మీడియం కొనసాగించాలని, ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించాలని కోరారు. ఉపాధ్యాయులపై బోధనేతర భారం తొలగించాలని, మినిమల్ టైమ్ స్కేల్‌తో పాటు పదవీవిరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్ ప్రకటించాలని, మున్సిపల్ టీచర్ల పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్లు సుధాకర్, వెంకటయ్య, శ్రీనివాసులు, రవీంద్ర, విజయ్‌కుమార్, గంగులప్ప, గణేష్ కుమార్, వెంకటరమణ, పద్మావతమ్మ, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

రీజియన్‌లోనే మదనపల్లె డిపోకు మొదటిస్థానం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మదనపల్లె వన్ డిపో రీజియన్‌లోనే మొదటి స్థానంలో నిలిచిందని ఆ డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం సిబ్బందితో గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సహకారంతో ఇంతటి విజయం సాధించామన్నారు. ప్రతి నెల అంకితభావంతో ఉద్యోగులు పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఎర్నింగ్, కేఎంపీఎల్ మొదటి స్థానం సాధించిన ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఎఫ్, రవి, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లపై

నేడు సదస్సు

మదనపల్లె, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాజకీయ హక్కులు-ప్రవేటు రంగంలో రిజర్వేషన్లపై బుధవారం మదనపల్లెలో సదస్సు నిర్వహిస్తున్నట్లు బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీని పూనా ఒప్పంద దుర్దినంగా పేర్కొంటూ వీసీకే పార్టీ, బాస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో విద్యార్థి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.